గురువారం
19-10-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 119
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మలాలా రూ.2.5 కోట్ల సాయం

గాజా ఆసుపత్రిపై దాడి, వందల మంది చనిపోవడంపై నోబెల్ గ్రహీత మలాలా యూసఫ్‌జాయ్ విచారం వ్యక్తం చేశారు. బాధితులను ఆదుకునేందుకు తన వంతుగా రూ.2.5కోట్ల సాయం ప్రకటించారు. 'గాజాలోని అల్-అహ్లి ఆసుపత్రిపై బాంబు దాడి భయానకం. దీనిని నిస్సందేహంగా ఖండిస్తున్నా. ఇజ్రాయిల్, పలస్తీనా, ప్రపంచవ్యాప్తంగా శాంతి నెలకొనాలని కాంక్షిస్తూ వారితో గొంతు కలుపుతున్నా. గాజా జనాభాలో సగం మంది 18 ఏళ్ల లోపువారే. వారు తమ జీవితాంతం బాంబు దాడుల మధ్య ఉండరాదు' అని వీడియో సందేశమిచ్చారు.

సుప్రీంకు కృష్ణా

జల వివాదం

కేంద్ర నూతన విధి విధానాలను సవాల్ చేస్తూ ఏపీ పిటిషన్

జలపంపిణీపై విచారణ ప్రారంభించిన ట్రిబ్యునల్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ వివాదంపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ విచారణ ప్రారంభించిన రోజునే ట్రిబ్యునల్‌కు కొత్త విధి విధానాలు ఇవ్వడంపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను సవాల్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలకు సంబంధించిన విషయంలో పూర్తి విచారణ జరిపి తగిన ఆదేశాలు ఇవ్వాలని ఈ నెల 6వ తేదీ కేంద్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలతో నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య ఉన్న కృష్ణా నదీ జలాల పంపకాలపై విచారణాధికారాలను కేంద్రం నోటిఫై చేసింది. దీనిపై తాము పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాల్సి ఉందని, అందుకు కొంత సమయం కావాలని ఏపీ ప్రభుత్వం ట్రిబ్యునల్‌ను కోరింది. ఏపీ అభ్యర్థనను తెలంగాణ ప్రభుత్వం తోసిపుచ్చింది. నీటి పంపకాలపై వెంటనే విచారణ చేపట్టాలని ట్రిబ్యునల్‌ను కోరింది. కాని ఏపీ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ట్రిబ్యునల్ నవంబరు 15వ తేదీలోగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌పై అభిప్రాయం చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణ నవంబరు 22, 23 తేదీల్లో చేపట్టనున్నట్లు ట్రిబ్యునల్ తెలిపింది. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు అదనపు

- మిగతా 2 లో

బీజేపీకి అసమ్మతి సెగ

- ఎన్నికల రాష్ట్రాల్లో పార్టీ శ్రేణులు, నేతల్లో అసంతృప్తి
- టికెట్ల కేటాయింపుపై నిరసనలు
- కాషాయ అధిష్ఠానం ఉక్కిరిబిక్కిరి

న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల ఎన్నికలు బీజేపీకి తలనొప్పిగా మారాయి. ఎలాగైనా అధికారం నిలుపుకోవాలని, దక్కించుకోవాలనే ఆరాటం నీరుగారే పరిస్థితికి వచ్చింది. టికెట్ల పంచాయతీ పార్టీ అధిష్ఠానాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇతర పార్టీల నాయకులను ఆకర్షించడం, లొంగదీసుకోవడం వంటి ధోరణి ప్రదర్శించే బీజేపీకి పాత నాయకులు, శ్రేణుల నుంచి తీవ్ర నిరసన సెగ తగులుతోంది. మధ్య ప్రదేశ్, రాజస్థాన్‌లో కొత్త మొఖాలకు టికెట్లు ఇవ్వడం ఇప్పుడు పార్టీలో అసమ్మతికి దారితీసింది. చాలా కాలంగా పార్టీ అధి నాయకుల వ్యవహార శైలి పట్ల వ్యతిరేకతతో ఉన్న నాయకులు ఇప్పుడు బాహాటంగానే ఆరోపణలు, విమర్శలు గుప్పిస్తున్నారు. సిట్టింగ్‌లను కాదని, కొత్త వారికి టికెట్లు ఇవ్వడమేమిటని ప్రశ్నిస్తున్నారు. మధ్య ప్రదేశ్‌లో అధికార బీజేపీకి అసంతృప్తుల బెడద ఎక్కువైంది. ఇప్పటివరకు 136 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. మొత్తం 230 స్థానాలకు గాను మరో 94 మంది అభ్యర్థుల పేర్లు ఖరారు చేయాల్సి ఉంది. అయితే సిట్టింగులు, సీనియర్ నాయకులను కాదని ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి, కొత్త ముఖాలకు టికెట్లు ఎట్లా ఇస్తారని స్థానిక నాయకత్వం ప్రశ్నిస్తున్నది. దీంతో

ఆందోళనకు గురైన అధిష్ఠానం అసమ్మతిని తగ్గించి, అసంతృప్తులను బుజ్జగించి పార్టీ వీడకుండా చూసేందుకు సీఎం శివరాజ్ సింగ్ అధ్వర్యంలో ప్రత్యేకంగా నలుగురు బడా నేతలతో ఓ కమిటీని నియమించింది. ఒక్కో కమిటీ సభ్యుడు 300 మంది నేతలతో చర్చలు జరపాలని లక్ష్యం నిర్దేశించింది. ఇంకా అభ్యర్థులను ప్రకటించని 94 సీట్లలో 67 స్థానాలు పార్టీ సిట్టింగ్ సీట్లే కావడం గమనార్హం. ఇందులో 9 మంది రాష్ట్ర మంత్రులూ ఉన్నారు. ఆయా నియోజక వర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత వల్ల ఇంతవరకు అభ్యర్థులను ఖరారు చేయలేకపోతున్నారు. బీజేపీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని ఈ సారి ఎన్నికల్లో కొత్త ముఖాలకు అవకాశమివ్వాలని సంఘ్ పరివార్ నిర్దేశించటంతో అభ్యర్థుల ఎంపిక ఇబ్బందిగా మారిందని సమాచారం.

సీఎం సీటు కోసం పోటీ

ప్రస్తుత ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్‌ను ఎన్నికల తరువాత మారుస్తారని, కొత్త ముఖ్యమంత్రి

- మిగతా 2 లో

శవాలదిబ్బ గాజా

- ఆగని మారణహోమం
- ఇజ్రాయిల్ ప్రతీకారానికి అమాయకులు బలి
- అహ్లీ ఆసుపత్రిపై దాడి : 500 మంది మృతి
- నెతన్యాహుకు బైడెన్ మద్దతు
- సహకారానికి హామీ

జెరూసలేం: ఇజ్రాయిల్-హమాస్ మధ్య యుద్ధం 12వ రోజుకు చేరుకుంది. ఇజ్రాయిల్ ప్రతీకార దాడులతో పలస్తీనా వణికిపోతోంది. గాజా శవాలదిబ్బగా మారిపోతోంది. హమాస్‌ను అంతంచేసే వరకు యుద్ధం ఆగదని ఇజ్రాయిల్ ప్రకటించింది. ఇప్పటికే మృతుల సంఖ్య ఐదు వేలకు చేరుకుంది. మారణహోమం కొనసాగుతుండగా గాజా నగరంలోని అహ్లీ ఆసుపత్రిపై వైమానిక దాడితో 500 మంది సామాన్యులు ప్రాణాలు కోల్పోయారు. అనేకమంది మృత్యువుతో పోరాడుతున్నారు. గాయపడిన వారి సంఖ్య 600కుపైగానే ఉంది. ఈ దారుణానికి ఇజ్రాయిల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) కారణమని హమాస్ ఆరోపించగా ఇజ్రాయిల్

- మిగతా 2 లో

ఇజ్రాయిల్‌ది యుద్ధ నేరం...

గాజాలో మారణహోమాన్ని తక్షణమే ఆపాలి: సీపీఐ

- 8లో

సీఐడీకి హైకోర్టు మొట్టికాయలు!

మార్గదర్శి కేసులో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : మార్గదర్శి కేసులో హైకోర్టు సీఐడీకి ఝలక్ ఇచ్చింది. మరో పక్క ఆ సంస్థ చైర్మన్ రామోజీరావు, ఎండీ శైలజాకిరణ్‌కు ఊరట లభించింది. యూరిరెడ్డి పిటీషన్‌పై బుధవారం విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం సీఐడీ దర్యాప్తును 8 వారాలు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కౌంటరు దాఖలు చేయాలని ప్రతివాదులు యూరిరెడ్డి, సీఐడీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను డిసెంబరు 6వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో

- మిగతా 2 లో

రాయలసీమకు న్యాయం కోసం

పోరు తప్పదు

- ఏపీకి మోదీ, అమిత్ షా అన్యాయం
- కడప రాష్ట్ర సదస్సులో వక్తలు, నిపుణులు

విశాలాంధ్ర-కడప బ్యూరో: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో జరిగిన సాగునీటి ప్రాజెక్టుల జల కేటాయింపుల్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకున్నదనీ, ఏపీకి ముఖ్యంగా కరువుకాటకాలకు నిలయమైన రాయలసీమ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేసేలా తీసుకున్న ఈ నిర్ణయాలను ఏమాత్రం అడ్డుకోకుండా రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కేంద్రానికి, తెలంగాణ రాష్ట్రానికి దాసోహంగా మారిందని వక్తలు, నిపుణులు విమర్శించారు. రాయలసీమకు న్యాయం జరగాలంటే పోరాటం తప్పదన్నారు. కృష్ణ జలాల పునః పంపిణీ పై కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో కడప వైఎస్ఆర్ ఆడిటోరియంలో బుధవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఓబులేసు అధ్యక్షతన రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.తులసి రెడ్డి, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్, రాయలసీమ నీటిపారుదల రంగ నిపుణులు బొజ్జ దశరథ రామిరెడ్డి, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ

- మిగతా 2 లో

15 నుంచి సమగ్ర

కులగణన

- బీసీల్లో వెనుకబడిన కులాల గుర్తింపు
- సీనియర్ ఐఏఎస్‌లతో అధ్యయన కమిటీ ఏర్పాటు
- మంత్రి చెల్లుబోయిన వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలోని వెనుకబడిన తరగతి వర్గాల చిరకాల కోర్కె అయిన సమగ్ర కులగణనకు నవంబర్ 15 న శ్రీకారం చుట్టనున్నట్లు రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ మంత్రి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

వార్నీ.. నాకు మళ్లీ చెట్లు కొట్టించే పని పడిందన్నమాట!

ప్రజాధనం అదానీ జేబులోకి...

- బొగ్గు ధరలు పెంచి 12వేల కోట్ల దోపిడీ
- అధికారంలోకి వచ్చాక దీనిపై విచారిస్తాం : రాహుల్

న్యూఢిల్లీ: ప్రజాధనం అదానీ జేబులోకి వెళుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. అదానీ గ్రూపు కుంభకోణాలపై ప్రధాని మోదీ మౌనాన్ని ప్రశ్నించారు. 2024లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వ్యవహారాలను విచారిస్తుందన్నారు. బొగ్గు దిగుమతులపై అధిక ఇన్‌వాయిస్‌లతో ప్రజలను అదానీ గ్రూపు దోచేస్తోందని ఆరోపించారు. విద్యుత్‌కు ఎక్కువ చెల్లించేలా ప్రజలను ఒత్తిడి చేస్తూ రూ.12వేల కోట్లను అదానీ జేబులో వేసుకున్నారని వ్యాఖ్యానించారు. మార్కెట్ విలువ కంటే ఎక్కువ ధరకు అదానీ గ్రూప్ బొగ్గు దిగుమతి చేసుకున్నట్లు ది ఫైనాన్షియల్ టైమ్స్‌లో వచ్చిన వార్త ఆధారంగా రాహుల్ ఈ ఆరోపణలు చేశారు. ఆయన బుధవారం ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2024లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అదానీ వ్యవహారంపై తప్పక దర్యాప్తు జరుగుతుందని తెలిపారు. అదానీ విషయంలో ప్రధాని మోదీ మౌనాన్ని ప్రశ్నించారు. దర్యాప్తునకు ఎందుకు ఆదేశాలివ్వడం లేదని, తన విశ్వసనీయతను కాపాడుకునే ప్రయత్నం ఎందుకు చేయడం లేదని అడిగారు. అదానీ గ్రూప్ ఇండోనేసియా నుంచి బొగ్గు దిగుమతి చేసుకుంటుంది. అది భారత్‌కు వచ్చేసరికి ధర రెట్టింపు అవుతోందని రాహుల్ తెలిపారు. బొగ్గు దిగుమతులపై అధిక ఇన్‌వాయిస్‌లతో విద్యుత్ కోసం ప్రజలు

ఎక్కువగా చెల్లించేలా చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచం మరెక్కడైనా ఇలాంటి వార్తలొస్తే అక్కడి ప్రభుత్వం కూలిపోయేది కానీ భారత్‌లో కనీసం చర్యలే కరువయ్యాయని వ్యాఖ్యానించారు. పేదలకు విద్యుత్ సబ్సిడీలను కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇస్తున్నట్లు తెలిపారు. 'కర్నాటకలో విద్యుత్ సబ్సిడీలు ఇస్తున్నాం. మధ్యప్రదేశ్‌లోనూ అమలు చేస్తాం. ఓ వైపు మేము సబ్సిడీలు ఇస్తుంటే మరోవైపు ప్రజల సొమ్ముతో అదానీ జేబులు నింపుకుంటున్నారు. ప్రధానమంత్రి దీని గురించి ఎందుకు మాట్లాడరో అర్థం కాదు. ప్రధాని అండదండలు లేకుండా ఇది అసాధ్యం. ఆ వ్యక్తిపై ఎందుకని చర్యలు తీసుకోరన్నదే ప్రశ్న' అని రాహుల్ అన్నారు. అదానీకి మద్దతివ్వడంపై శరద్

- మిగతా 2 లో

ఎన్నికల వరాలు!

- కేంద్ర ప్రభుత్వోద్యోగుల డీఏ పెంపు
- రైల్వే ఉద్యోగులకు 78 రోజుల వేతనం బోనస్
- ఆరు పంటలకు పెరిగిన ఎంఎస్పీ
- వరిని మర్చిన వైనం
- లధక్‌లో సోలార్ ప్రాజెక్టు
- ప్రజల్ని మెప్పించేలా కేబినెట్ నిర్ణయాలు

- 8లో

'విశాఖకు పాలన'పై

సుప్రీంకు

రుషికొండపై నిర్మాణాలు జరుగకుండా ఉత్తర్వులివ్వాలని వినతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: డిసెంబరు నుంచి విశాఖకు మకాం మార్చాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయంపై బుధవారం సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలైంది. విజయవాడకు చెందిన పర్యావరణవేత్త లింగమనేని శివరామ ప్రసాద్ ఈ మేరకు ప్రయోజ్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. 'కోస్టల్ రెగ్యులేటరీ జోనుకు సంబంధించి జాతీయ హరిత ట్రిబ్యునల్

- మిగతా 2 లో

అట్టుడికిన పశ్చిమాసియా

- కట్టలు తెంచుకున్న ప్రజాగ్రహం
- గాజా ఆసుపత్రిపై దాడికి నిరసన
- లెబనాన్, జోర్డాన్, టర్కీ, వెస్ట్‌బ్యాంక్, ఇరాక్, పాక్‌లలో భారీ ప్రదర్శనలు
- ఇజ్రాయిల్, అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ దౌత్యకార్యాలయాల ముట్టడి
- ఇజ్రాయిల్‌తో శాంతి ఒప్పందం రద్దుకు డిమాండ్

టెల్‌అవీవ్: ఇజ్రాయిల్, హమాస్ మధ్య యుద్ధం క్రమంలో సామాన్యులు పెద్దసంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. దీనిపై అంతర్జాతీయ సమాజం తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేస్తోంది. తాజాగా గాజాలోని ఆసుపత్రిపై జరిగిన క్షిపణి దాడిలో 500 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ పరిణామం పలస్తీనీయన్లతో చుట్టుపక్కల ప్రజలను తీవ్రస్థాయిలో ఆగ్రహావేశానికి గురిచేసింది. ఇజ్రాయిల్ మారణహోమాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు రోడ్లపైకొచ్చి పెద్దఎత్తున ప్రదర్శనలు నిర్వహించారు. ఇజ్రాయిల్‌తో శాంతి ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని పాలకులను డిమాండ్ చేశారు.లెబనాన్, జోర్డాన్, టర్కీ వెస్ట్‌బ్యాంక్, ఇరాక్, ఇరాన్‌లలో భారీ ప్రదర్శనలు జరిగాయి. హిజ్బుల్లా పిలుపుతో నిరసనలు పెద్దఎత్తున సాగాయి. బీరుట్, అవ్‌కర్ శివార్లలోని అమెరికా దౌత్యకార్యాలయం వైపునకు వందల మంది కదంతొక్కగా ఆందోళనకారులకు, లెబనాన్ భద్రతా దళాలకు మధ్య ఘర్షణ తలెత్తింది. నిరసనకారులు రాళ్లదాడికి దిగారు. సమీపంలోని ఓ భవనానికి నిప్పుపెట్టారు. దీంతో పోలీసులు బాష్పవాయువు, జలఫిరంగులను ప్రయోగించారు. 'అమెరికాకు మరణం', 'ఇజ్రాయిల్‌కు మరణం' నినాదాలు మార్మోగాయి. బీరుట్‌లోని ఫ్రాన్స్ దౌత్యకార్యాలయం వద్ద హిజ్బులా జెండాలతో నిరసనలు జరిగాయి. కార్యాలయం ప్రవేశద్వారం మీదకు రాళ్లు విసిరారు. అలాగే జోర్డాన్ రాజధాని అమ్మన్‌లో ఇజ్రాయిల్ ఎంబసీ వద్దకు వేలాది మంది చేరుకొని హమాస్‌కు మద్దతు తెలిపారు. దౌత్య కార్యాలయాన్ని తక్షణమే మూసివేయాలని, ఇజ్రాయిల్‌తో శాంతి ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని ముక్తకంఠంతో డిమాండ్‌చేశారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు బాష్పవాయువును పోలీసులు వాడారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని బ్రిటిష్, ఫ్రాన్స్ రాయబార కార్యాలయాలను బుధవారం ఉదయాన్నే నిరసనకారులు ముట్టడించారు. 'ఫ్రాన్స్- ఇంగ్లండ్‌కు మరణం' అంటూ నినదించారు. దౌత్యకార్యాలయంపై గుడ్లు విసిరారు. సెంట్రల్ టెహాన్‌లోని పలస్తీన్ స్క్వేర్ వద్దకు వేలాది మంది చేరుకొని తమ ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. టర్కీ, ఇస్తాంబుల్‌లోని ఇజ్రాయిల్ కాన్సులేట్ వద్ద పలస్తీనాకు మద్దతుగా ఆందోళన జరిగింది. లిబియాలోనూ అన్ని వయస్సుల వారు ప్రదర్శనల్లో పాల్గొన్నారు. పలస్తీనా జెండాలు ప్రదర్శించారు. ట్రిపోలీ వీధులన్నీ నిరసనకారులతో నిండిపోయాయి.

విశాలాంధ్ర ప్రపంచం

గాజా ప్రజలకు మద్దతుగా నినాదాలు మార్మోగాయి. యమన్‌లోని తాజ్ నగరంలో, మొరాకో రాజధాని రబాత్, ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోనూ భారీస్థాయిలో పలస్తీనా ప్రజలకు మద్దతుగా ప్రదర్శనలు జరిగాయి. వెస్ట్‌బ్యాంక్‌లోని రామల్లా సెంట్రల్ మనారా స్క్వేర్ వద్దకు ప్రదర్శనగా చేరుకొన్న వందల మంది హమాస్‌కు మద్దతు తెలిపారు. వెస్ట్‌బ్యాంక్ నగరాలైన నబ్లుస్, తుబాస్, జెనిన్‌లలో పలస్తీనా భద్రతా దళాలతో నిరసనకారులు ఘర్షణకు దిగారు. ఇదిలావుంటే పాకిస్తాన్‌లోనూ పలస్తీనాకు మద్దతుగా వేలాది మంది కదంతొక్కారు. కరాచీలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. పలస్తీనాకు విమోచనం బ్యానర్లు ప్రదర్శించారు. సింధ్ ఫార్మర్స్ ఫ్రంట్, పాకిస్తాన్ స్టీల్ కార్మికసంఘం, జాతీయ కార్మిక సమాఖ్యతో పాటు రాజకీయ, మతపరమైన సంఘాలు ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నాయి. ప్రదర్శనకారులు 'గాజా... మేము ఇక్కడున్నాం', 'అక్సా... మేమిక్కడే ఉన్నాం',' ఇది పలస్తీన్ రాజ్యం' అని నినదించారు. కరాచీతో పాటు పెషావర్, లాహోర్, ఇస్లామాబాద్‌లో పెద్దఎత్తున ప్రదర్శనలు జరిగాయి. కొన్నిచోట్ల అమెరికా, ఇజ్రాయిల్ జెండాలకు నిరసనకారులు నిప్పుపెట్టారు.

గ్రీస్‌లో ఆరుగురు కమ్యూనిస్టు మేయర్ల ఎన్నిక

ఏథెన్స్: గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) స్థానిక, మున్సి ఎన్నికల్లో సత్తా చాటింది. పార్టీ తరపున అనేకమంది విజేతలుగా నిలిచారు. ఆరుగురు మేయర్లుగా ఎన్నిక కాగా వందల మంది కౌన్సిలర్లయ్యారు. 2019తో పోల్చితే కేకేఈ ఓట్లశాతం 6.86 శాతం నుంచి పది శాతానికిపైగా పెరిగింది. ఇకారియా ద్వీపం నుంచి మొదటి మేయర్ ఎన్నిక జరిగింది. మూడవ అతిపెద్ద నగరమైన పట్రాస్‌లో ఎన్నికయ్యారు. తొలి దశలో 41శాతం ఓట్లు రాగా మలిదశలో 56శాతం ఓట్లు వచ్చాయి. దీంతో విజయం సాధ్యమైంది. అలాగే కైసారియాని, పెట్రోపోలి, చైదరి, ట్రిర్నావోస్ మున్సిపాలిటీల్లో మేయర్లుగా కమ్యూనిస్టులు ఎన్నికయ్యారు. మొత్తంగా ఆరుగురు మేయర్లు కాగా కౌన్సిలర్లుగా వందల మంది కమ్యూనిస్టులు ఎన్నికయ్యారు.

ప్రజాధనం అదానీ జేబులోకి...

(మొదటిపేజీ తరువాయి)

పవార్‌ను ప్రశ్నించారా అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన ప్రధానిగా ఉండి అదానీకి అండదండలు కల్పిస్తే తప్పక ప్రశ్నించేవాడినని బదులిచ్చారు. 'ఎన్సీపీ అధినేత శరద్ పవార్ భారత్‌కు ప్రధానమంత్రి కాదు. ఆయన అదానీకి రక్షణ కల్పించడం లేదు. అదానీని కాపాడేది మోదీ కాబట్టి ఆయననే ప్రశ్నిస్తున్నా... పవార్‌ను కాదు. పవార్ ప్రధానిగా ఉండి అదానీకి రక్షణ కల్పిస్తే తప్పక నిలదీసేవాడిని' అని రాహుల్ గాంధీ తెలిపారు. హిండెన్‌బర్గ్ నివేదికలో అదానీ గ్రూపు అవినీతి వెలుగు చూసినప్పటి నుంచి ఆ సంస్థపై దర్యాప్తునకు కాంగ్రెస్ డిమాండ్ చేస్తుండటం విదితమే.

బీజేపీకి అసమ్మతి సెగ

(మొదటిపేజీ తరువాయి)

రేసులో తామంటే తాము ఉన్నామంటూ సీనియర్ నేతలు చేస్తున్న ప్రకటనలను కూడా పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. సీఎం రేసులో తానున్నానని నాయకులు చేస్తున్న వ్యక్తిగత ప్రకటనల వల్ల పార్టీకి మరింత నష్టం జరుగుతున్నదని బీజేపీ అధిష్ఠానం భావిస్తోంది. వయసు, అనారోగ్య కారణాలను చూపుతూ ఇద్దరు మంత్రులను ఎన్నికల్లో పోటీ చేయవద్దని ఆదేశించింది. పార్టీలో ఎన్నో ఏళ్ల నుంచి కష్టపడుతున్న కార్యకర్తలు, నాయకులకు కాకుండా ఎన్నికలప్పుడు బీజేపీలో చేరిన ఇతర పార్టీల నాయకులకు ఎలా టికెట్లిస్తారని స్థానిక నాయకత్వం ప్రశ్నిస్తున్నది. దీంతో టికెట్ల కేటాయింపుపై పార్టీ అధిష్ఠానం మీనమేషాలు లెక్కిస్తున్నది.

సిట్టింగ్‌లకు చోటు దక్కేనా?

బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో 40 మందికి ఈసారి టికెట్లు కట్ చేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రజల్లో వ్యతిరేకత, ఆయా ఎమ్మెల్యేల విజయావకాశాలు తక్కువని వచ్చిన సర్వే ఫలితాల వల్ల చాలావరకు గెలుపు గుర్రాలనే ఎన్నికల బరిలో దించాలని సంఘ్ పరివార్ నాయకుల నుంచి బీజేపీకి ఆదేశాలు అందినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఒకవేళ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు ఇవ్వకపోతే వారు ఇతర పార్టీల్లోకి వెళ్లే అవకాశం ఉందని, అందుకే ఆఖరి నిమిషం వరకు వారి పేర్లను అధిష్ఠానం నిలిపివేత జాబితాలో పెడుతున్నదని, అదే బీజేపీకి తలనొప్పిగా తయారైందని రాజకీయ విశ్లేషకుడు అరుణ్ దీక్షిత్ అభిప్రాయపడ్డారు.

రాజస్థాన్‌లో బీజేపీకి రాజే షాక్?

బీజేపీలో తనకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై ఆగ్రహంతో ఉన్న వసుంధరరాజే సొంత పార్టీకి షాక్ ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. అసెంబ్లీ టికెట్ దక్కని వసుంధర విధేయులు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగనున్నట్టు సమాచారం. 'పార్టీ కోసం జీవితాన్ని అంకితం చేసిన నన్ను మోసం చేశారనిపిస్తున్నది. నా ప్రజలు నేను పోటీ చేయాలని కోరుతున్నారు. నేను పోటీ చేస్తాను' అని నగర్‌కు చెందిన అనితా సింగ్ గుర్జర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు సర్వత్ సింగ్ రిజ్వి, రాజ్‌పాల్ సింగ్ షెకావత్ కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మొదటి జాబితా విడుదలైన నేపథ్యంలో వందలాది మంది వసుంధరా రాజే మద్దతుదారులు శనివారం ఆమె అధికారిక నివాసం ముందు గుమికూడి ఆమెకు మద్దతు తెలిపారు. అసెంబ్లీ అభ్యర్థుల రెండో జాబితాను ప్రకటించే ముందు పార్టీ అధిష్ఠానానికి ఒక సందేశం ఇవ్వాలనే ఉద్దేశంతోనే వారిలా గూమికూడినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో టికెట్ల కేటాయింపు బీజేపీకి తలనొప్పిగా మారే అవకాశమున్నట్టు కనిపిస్తున్నది.

శివరాజ్‌కు పోటీగా 'రామాయణ' నటుడు

మధ్య ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాషాయ దళం రాముడిని నమ్ముకుంటే పాలక బీజేపీకి చెక్ పెట్టేందుకు కాంగ్రెస్ హనుమాన్‌ను తెరపైకి తీసుకువచ్చింది. సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌పై కాంగ్రెస్ పార్టీ టీవీ సీరియల్ రామాయణ్ 2లో హనుమాన్ పాత్రధారి విక్రమ్ మస్తల్‌ను బరిలో నిలిపింది. ఈ ఏడాది జులైలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మస్తల్‌ను ఆ పార్టీ నాయకత్వం ఏకంగా శివరాజ్ చౌహాన్‌పై పోటీకి నిలిపింది. చౌహాన్ కంచుకోట బుధ్నిలో మస్తల్ తన అదృష్టం పరీక్షించుకోనున్నారు. రాముడి పేరుతో కాషాయ పార్టీ సాగించే రాజకీయాలను హనుమాన్ శక్తితో ఎదుర్కొనే దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. జూన్ 12న జబల్‌పూర్‌లో హనుమాన్ భారీ కటౌట్లతో జై బజరంగ్ బలి నినాదాలు హోరెత్తిస్తుండగా ర్యాలీ నిర్వహించిన కాంగ్రెస్ మధ్య ప్రదేశ్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. కర్నాటక తరహాలో బజరంగ్‌బలి గద మధ్య ప్రదేశ్‌లోనూ తమకు మెరుగైన ఫలితాలు అందిస్తుందని కాంగ్రెస్ నేత తరుణ్ భానోత్ ఆశాభావం వ్యక్తం చేశారు.

పోరు తప్పదు

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులు ఈశ్వరయ్య, జగదీశ్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రయ్య, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనారాయణ రెడ్డి ప్రాజెక్టుల తీరుతెన్నుపై విపులంగా సదస్సులో చర్చించారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షల ఎకరాల భూములు బీడు భూములుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 671 మండలాలు ఉండగా అందులో 611 మండలాలు గ్రామీణ ప్రాంతాలు ఉన్నాయని అందులో 300 మండలాలు సాగునీరు లేక తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఎదుర్కొంటున్నాయనీ, దీంతో రైతులు ఆత్మహత్యలు వలసలు జరుగుతున్నాయని వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ఈ నెల 4న దిల్లీలో ఉండగానే కేంద్ర కేబినెట్ సమావేశమై కృష్ణా జలాలపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినా సీఎం నోరు విప్పకపోవడం చూస్తుంటే రాష్ట్రం ఏమైనా పర్వాలేదు, కేసులు నుంచి బయటపడితే చాలన్నట్టు సీఎం తీరు ఉందని విమర్శించారు. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఇంతవరకు నోటిఫికేషన్ చెయ్యని పరిస్థితుల్లో ఆంధ్ర, తెలంగాణ మధ్య జల పంపిణీ బాధ్యతను మళ్లీ అదే ట్రిబ్యునల్‌కు కట్టబెట్టడం భావ్యం కాదన్నారు. తెలంగాణలో ఎన్నికల దృష్ట్యా ఆంధ్ర రాయలసీమకు తీవ్ర అన్యాయం చేస్తూ తెలంగాణలో గెలుపే ధ్యేయంగా గెజిట్ నోటిఫికేషన్ తీసుకువచ్చారన్నారు. దీనిపైన అన్ని రాజకీయ పార్టీలు ముందుకు వచ్చి సీపీఐ చేస్తున్న ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని రామకృష్ణ కోరారు.

సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రానికి రావలసిన సాగునీటి ప్రాజెక్టులు, ప్రాజెక్టులలోని నీటి కోసం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు కేంద్రంతోనూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతోనూ యుద్ధమే చేశారన్నారు. 2018లో కేసీఆర్, చంద్రబాబు నాయుడు అప్పటికేంద్ర జల వనరుల శాఖ మంత్రి ఉమాభారతితో సమావేశం నిర్వహించారనీ, ఆ సమావేశంలో మన రాష్ట్రానికి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల నీటిని కేటాయించారన్నారు. ఆంధ్రాలో రాయలసీమ ప్రాంతంతో పాటు నెల్లూరు, ప్రకాశం, జిల్లాలు కూడా వ్యవసాయ రంగంలో తీవ్ర వెనుకబాటుతనంతో కరువు కాటకాలు రైతుల ఆత్మహత్యలు, కౌలు రైతుల అప్పులు తీవ్రస్థాయిలో ఉన్నాయన్నారు. ఎగువ రాష్ట్రాల్లో లోని ప్రాజెక్టుల వల్ల దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. రాయలసీమకు జరిగిన అన్యాయం పైన, నీటి రంగం పైన సీపీఐ చేస్తున్న ఉద్యమానికి టీడీపీ తరపున సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని సోమిరెడ్డి తెలిపారు.

ఎన్. తులసి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రానికి అన్ని రంగాల్లోనూ అన్యాయం జరిగిందనీ, ముఖ్యంగా ప్రత్యేక హోదా ,ఉక్కు కర్మాగారం, బందరు పోర్టు, పోలవరం, విశాఖ రైల్వే జోన్, ఒకటని కాకుండా ప్రతి రంగంలోనూ రాష్ట్రం అన్యాయానికి గురైందన్నారు. తెలుగు గంగ, గాలేరు నగరి, సుజల స్రవంతిలాంటి ప్రాజెక్టులు నత్త నడక నడుస్తున్నాయని జగన్ చేతకానితనం వల్ల రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్నాడన్నారు. ప్రాజెక్టుల పైన సమగ్రంగా చిత్రపటం ద్వారా ఆయన వివరించారు.

ఎంఏ గఫూర్ మాట్లాడుతూ సీఎం జగన్ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి 30 ఏళ్లు తిష్ట వేసుకొని కూర్చోవాలని చూస్తున్నాడు తప్ప రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టి ప్రజలను, వ్యవసాయ రంగాన్ని కుదేలు చేస్తున్నాడన్నారు. 10 లక్షల కోట్లు అప్పు తెచ్చి రెండు లక్షల కోట్లు మాత్రం బటన్ రూపంలో నొక్కి మిగతాదంతా తన ప్యాలెస్ కు తరలించాడని విమర్శించారు

ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రాజెక్టుల పైన అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ముందుకు వెళ్తామనీ, దసరా తర్వాత భవిష్యత్ కార్యాచరణను మరింత పకడ్బందీగా ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. ఉద్యమాన్ని భారీ స్థాయిలో ముందుకు తీసుకెళ్తామని ముప్పాళ్ల హెచ్చరించారు.

ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో జరిగిన నీటి కేటాయింపులకు భిన్నంగా జగన్ ప్రభుత్వం ముందుకెళ్లడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రాజెక్టు నీటిమట్టం తగ్గినట్లయితే విద్యుత్ ఉత్పత్తి ఉండదనీ, ఎడమ కాలువకు నీటిపారుదల కష్టమవుతుందని ఉత్తరాంధ్ర, రాయలసీమ, కోస్తా, అన్ని ప్రాంతాలు దెబ్బతింటాయని చెప్పారు. ఇప్పటికే ఖరీఫ్, రబీ రెండు పంటలకు అవకాశం లేకుండా పోయిందన్నారు. దీంతో రైతులు, కౌలుదారులు ఉపాధి లేక ప్రజలు వలసలు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల నిర్లక్ష్యంతో రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ నత్తనడకన నడుస్తున్నాయని టీడీపీ పుణ్యమా అని పట్టిసీమ పూర్తి చేసి కృష్ణాడెల్టాకు ఉపశమనం కల్పించారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెత్తందార్లకు ఊడిగం చేస్తూ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. కృష్ణాజలాలకు నోటిఫికేషన్ కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తే కేంద్రంపై రాష్ట్రం అలుపెరుగక పోరాటం చేయకుండా సుప్రీంకోర్టుకు వెళతామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. పార్లమెంటులో కావాల్సినంత మంది ఎంపీలు ఉన్నా రాష్ట్ర కేబినెట్‌ను సమావేశపరిచి తీర్మానం చేసి కేంద్రం మెడలు వంచైనా రాష్ట్రానికి న్యాయం చేయడానికి బదులు జగన్ వారి చెప్పుచేతల్లో ఉండడం విచారకరమన్నారు.

బొజ్జ దశరథరామిరెడ్డి మాట్లాడుతూ సొంత కుటుంబ సభ్యులకే ద్రోహం చేస్తున్న జగన్ రాష్ట్రాన్ని తాకట్టు పెట్టడానికి కూడా వెనుకడుగు వేయడని విమర్శించారు. అక్రమ కేసుల నుంచి బయటపడడానికి, కోర్టుల నుంచి తప్పించుకోవడానికి, తెలంగాణలో ఆస్తులు రక్షించుకోవడానికి జగన్ కేంద్రానికి దాసోహమంటున్నారని విమర్శించారు.

అక్కినేని వనజ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో ఒక్క నీటి ప్రాజెక్టు కూడా నిర్మాణం కాలేదని విమర్శించారు. జగన్ తన రాజకీయ అవసరాల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెడుతున్నాడన్నారు. విద్యుత్ మీటర్లు, విద్యుత్ చార్జీలు, అధిక ధరలపై రాబోయే కాలంలో పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు ఉపాధి లేదని విదేశాలలో అంతంత మాత్రమేనని స్వదేశంలో పెట్టుబడులు విదేశాల నుంచి వచ్చే పెట్టుబడులు లేక చదువుకున్న యువత ఏ రంగంలోనూ ముందుకు పోలేక అవస్థలు పడుతున్నారని పాలకులు ఈ విషయాన్ని గమనించి ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పి.రామచంద్రయ్య మాట్లాడుతూ ప్రాజెక్టుల కోసం కమ్యూనిస్టులే ఉద్యమాలు చేశారన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేస్తేనే రాయలసీమ సాగునీటి రంగంలో ముందుకు వస్తుందనీ, రైతులకు న్యాయం జరుగుతుందనీ, ఆ దిశగా పోరాట కార్యచరణ రూపొందించాలన్నారు.

మరోవక్త శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టులపైన జగన్‌కు ఏమాత్రం అవగాహన లేదన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాజెక్టులకు సంబంధించి ఒక కాలువ తీసింది గానీ, పార పట్టింది గాని, మట్టి తీసింది గాని లేదని విమర్శించారు. జగన్ పాలన ఇలాగే కొనసాగితే సాగునీటిని పక్కనపెట్టి తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతారని హెచ్చరించారు.జగదీశ్ మాట్లాడుతూ రైతు సంఘాలతో పాటు అన్ని రాజకీయ పార్టీలు కలిసి రాయలసీమ నీటి ప్రాజెక్టులపై అలుపెరుగని పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ రాయలసీమకు న్యాయం జరిగే వరకూ ఉధృతంగా పోరాటం చేస్తామని అందరినీ కలుపుకొని పోతామని చెప్పారు. ప్రాజెక్టుల నిర్లక్ష్యం, సీమ కరువు కాటకాల పట్ల ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన గేయాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సదస్సులో సీపీఐ రాయలసీమ జిల్లాలు, ప్రకాశం, బాపట్ల జిల్లా కార్యదర్శులు గాలి చంద్ర, నారాయణ, మురళి, నరసింహులు, సింగరాయకొండ, నాగరాజు, జాఫర్, గిడ్డయ్య, వేమయ్యతో పాటు ఏఐఎస్ఎఫ్ నాయకులు జాన్సన్ బాబు, శివారెడ్డి, ఏఐవైఎఫ్ నాయకులు లెనిన్, ప్రజానాట్యమండలి నాయకులు పెంచలయ్య, టిడిపి నాయకులు గోవర్ధన్ రెడ్డి, హరిప్రసాద్, సీపీఎం నాయకులు నారాయణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన

(మొదటిపేజీ తరువాయి)

చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ వెల్లడించారు. వెనుక బడిన వర్గాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల్లో అత్యంత వెనుకబడిన కులాలను గుర్తించి, వారిని ఉన్నత స్థాయికి తీసుకురావాలనే లక్ష్యంతోనే ఈ సమగ్ర కులగణనను చేపడుతున్నామని చెప్పారు. బుధవారం వెలగపూడి లోని రాష్ట్ర సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, దేశంలో 1931లో జరిగిన కులగణననే చివరిదని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తదుపరి 1951 నుంచి ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనగణన మాత్రమే నిర్వహిస్తున్నారన్నారు. ఈ జనగణనలో ఎస్సీ, ఎస్టీ జనాభాను తప్ప మిగిలిన అన్ని కులాలను గంపగుత్తగా లెక్కిస్తున్నారనీ, ఫలితంగా బీసీ వర్గానికి చెందిన అనేక కులాల ప్రజలు ఎంతగానో నష్టపోతున్నారని చెప్పారు. బీసీల్లో ఎన్నో వెనుకబడి కులాలున్నాయని, ఆ కులాల్లో అత్యంత వెనుకబడిన కులాలను గుర్తించి వారి అభ్యున్నతికి అనుగుణంగా ప్రభుత్వ పథకాలను రూపొందించి అమలు పర్చాల్సిన అవసరముందన్నారు.

బీసీల్లో వెనుకబడిన వారి అభ్యున్నతికి కృషి

బీసీల్లో అత్యంత వెనుకబడిన కులాలను గుర్తించి వారి అభ్యున్నతికి అనుగుణంగా పథకాలను రూపొందించి అమలు పర్చాలనే లక్ష్యంతో ఈ ఏడాది ఏప్రిల్ 11 న మహాత్మా జ్యోతీరావు పూలే జయంతిని పురస్కరించుకుని రాష్ట్రంలో కులగణన చేస్తామని సీఎం జగన్ ప్రకటించారని మంత్రి చెల్లుబోయిన గుర్తు చేశారు. ప్రతి పదేళ్లకు ఒక సారి జరిగే జనగణనతో పాటు సమగ్ర కులగణననూ రాష్ట్రంలో నిర్వహించాలని గత బడ్జెట్ సమావేశాల్లో శాసన సభలో తీర్మానించి కేంద్రానికి పంపామన్నారు. ఇప్పటి వరకు కేంద్రం నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అధికారాలకు అనుగుణంగా కులగణన చేయించాలని గత శాసన సభా సమావేశాల్లో తీర్మానించామని వివరించారు. అందుకు అనుగుణంగా బీసీ , ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, గ్రామ, వార్డు సచివాలయ శాఖలకు చెందిన ముఖ్యకార్యదర్శులతో ఇప్పటికే ఒక అధ్యయన కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ నేతృత్వంలో గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల సహకారంతో రాష్ట్రంలో కులగణనను వచ్చే నెల 15 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇందుకోసం ప్రత్యేకించి ఒక యాప్ ను రూపొందించామన్నారు. ఈ కులగణనలో భాగంగా బీసీ నాయకులు, కుల పెద్దల నుంచి సూచనలు, సలహాలు సేకరించేందుకు విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, కర్నూలు, తిరుపతి ప్రాంతాల వారీగా రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సీఐడీకి హైకోర్టు మొట్టికాయలు!

(మొదటిపేజీ తరువాయి)

సీఐడీ తదనంతర చర్యలన్నింటిపై హైకోర్టు స్టే ఇచ్చింది. రామోజీరావు, శైలజాకిరణ్ క్వాష్ పిటిషన్‌పై కౌంటర్ వేయాలని సీఐడీకి ఆదేశాలు ఇచ్చింది. ఇక యూరిరెడ్డి పిటిషన్‌పై విచారణ సందర్భంగా సీఐడీపై ఉన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. మీ పరిధిలో లేకున్నా కేసు ఎందుకు నమోదు చేశారని కోర్టు ప్రశ్నించింది. ఈ కేసుకి, చిట్ ఫండ్ కేసుకి సంబంధమేమిటని నిలదీసింది.

చిట్ ఫండ్ కేసు అయితే అది చిట్‌ఫండ్ చట్టం కిందకు వస్తుంది కదా అని హైకోర్టు సీఐడీని ప్రశ్నించింది. దీనిపై వెంటనే కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని ఆదేశిస్తూ తదుపరి విచారణను డిసెంబరు 6కి వాయిదా వేసింది.

'విశాఖకు పాలన'పై సుప్రీంకు

(మొదటిపేజీ తరువాయి)

(ఎన్జీటీ)లో తుది విచారణ ఉంది. ఎన్జీటీ ఆదేశాలు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పునకు విరుద్ధంగా విశాఖపట్నం, రుషికొండ మీద సీఎం క్యాంపు కార్యాలయం, సీనియర్ అధికారుల కార్యాలయాల ఏర్పాటు చేస్తున్నారు. కాబట్టి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈనెల 10న ఇచ్చిన జీవో 2015ను వెంటనే రద్దు చేయాలి' అని పిటిషనర్ కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 48ఏ ఉల్లంఘనలకు పాల్పడిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చర్యలను నిలువరించాలని, ఎన్జీటీ, హైకోర్టులో సంబంధిత కేసులు పరిష్కారమయ్యే వరకు రుషికొండపై ఏ విధమైన నిర్మాణాలు, ప్రారంభ కార్యక్రమాలు జరుగకుండా ఉత్తర్వులు ఇవ్వాలని అత్యున్నత న్యాయస్థానానికి శివరామ ప్రసాద్ విన్నవించారు.

సుప్రీంకు కృష్ణా జల వివాదం

(మొదటిపేజీ తరువాయి)



అధికారాలు ఇవ్వడం ద్వారా కృష్ణా నదీ జలాల పునఃపంపకానికి కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం రిట్ పిటిషన్ దాఖలు చేసింది. బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు ఇలా అదనపు అంశాలు పరిశీలించే అధికారం లేదని రాష్ట్ర ప్రభుత్వం రిట్ పిటిషన్‌లో పేర్కొంది. 2014 నాటి ఏపీ విభజన చట్టం ప్రకారం కృష్ణా నదీ జలాల కేటాయింపులకు రక్షణ ఉందని, కేంద్రం చర్యతో ఇప్పుడు బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ పునఃపంపకాలు చేపడితే తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రాష్ట్ర ప్రభుత్వం చెపుతోంది.

శవాలదిబ్బ గాజా

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఖండించారు. ఈ దాడి చేసినది ఇజ్రాయిల్ కాదు... హమాస్ అని దుయ్యబట్టారు. యుద్ధం తీవ్రరూపం దాల్చిన వేళ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇజ్రాయిల్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. గాజాను ఆక్రమించుకోవద్దని ఇప్పటికే మిత్రదేశానికి హితవు పలికిన పోటస్ తాజాగా నెతన్యాహును కలిసి పరిస్థితిని పరిష్కరించేందుకు యత్నించారు. నెతన్యాహును ఆలింగనం చేసుకొని బైడెన్ ఆత్మీయంగా పలుకరించారు. 'గాజా ఆసుపత్రిపై దాడి మీరు చేసినట్లు లేదు. ఇది హమాస్ పనే' అని సమర్థించారు. అవసరమైన సాయమందిస్తామని తెలిపారు. అమెరికా రెండువేల సైన్యాన్ని ఇప్పటికే ఇజ్రాయిల్ కోసం సిద్ధంగా ఉంచింది.

ఇది హమాస్ పని: ఐడీఎఫ్ ఆరోపణ

గాజాలోని ఉగ్రవాదులు అక్కడి ఆసుపత్రిపై దాడి చేశాయి తప్ప ఐడీఎఫ్ (ఇజ్రాయెల్ రక్షణ దళాలు) కాదు. మా పిల్లలను దారుణంగా హత్య చేసిన ఆ ఉగ్రవాదులు.. ఇప్పుడు తమ పిల్లలనూ చంపేస్తున్నారుని నెతన్యాహు ఆరోపించారు. ఐడీఎఫ్ ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియల్ హగారి కూడా ఏకీభవించారు. ఆయన మాట్లాడుతూ 'పేలుడు ప్రదేశంలో గొయ్యి ఏర్పడలేదు. గోడలు దెబ్బతినలేదు. పార్కింగ్‌లో పేలుడు జరిగింది. వైమానిక దాడులకు వాడే మందుగుండు ఆనవాళ్లు లేవు. ఇది ఇజ్రాయిల్ చేసిన దాడి కాదని తెలుస్తోంది. ఏరియల్ ఫుటేజినిబట్టి ఆసుపత్రికి దగ్గర నుంచి రాకెట్ ప్రయోగించినట్లు ఉంది. ఇది ఇస్లామిక్ జిహాదీల దాడి. వారి క్షిపణి గురితప్పి ఆసుపత్రి వద్ద పడింది. దగ్గర నుంచి రాకెట్ వచ్చి పడినందున దాని ఇంధనం గుర్తులు ఉన్నాయి. ఇస్లామిక్ జిహాద్ సంస్థ పది రాకెట్లు రాత్రి ప్రయోగించింది. ఆ సమయంలో ఆసుపత్రి వద్ద పేలుడు జరిగింది. రాకెట్ గురితప్పడం గురించి ఇద్దరు ఉగ్రవాదుల సంభాషణ మా ఇంటెలిజెన్స్ సేకరించింది' అని వెల్లడించారు. ఆ సంభాషణలు, పేలుడు ప్రదేశం ఏరియల్ వ్యూ వీడియోను ఐడీఎఫ్ ట్వీట్ చేసింది. జిహాదీల రాకెట్లు చాలా వరకు ప్రయోగస్థలికి దగ్గర్లోనే కూలిపోతుంటాయని డేనియల్ హగారి తెలిపారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి 450 రాకెట్లు గాజా భూభాగంలోనే కూలిపోయినట్లు ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, వాటిని అమెరితో పంచుకుంటున్నల్లు వెల్లడించారు.

ఆ నలుగురు దేశాధినేతలతో బైడెన్ భేటీ రద్దు

అల్ అహ్లీ ఆసుపత్రిపై దాడి నేపథ్యంలో జోర్డాన్, ఈజిప్టు దేశాధినేతలతో జరగాల్సిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భేటీ రద్దు అయింది. ఇజ్రాయిల్-హమాస్ యుద్ధానికి పరిష్కారం కనుగొనేందుకుగాను జోర్డాన్ రాజు అబ్దుల్లా-2, పలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్, ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తా అల్ సిసీ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ను ఒక చోటకు చేర్చే ఉద్దేశంతో ఈ సదస్సుకు ఏర్పాట్లు చేసినట్లు జోర్డాన్ అధికార వార్తాసంస్థ 'పెట్రా' నివేదించింది. అయితే తాజా పరిణామాలతో నలుగురు అధినేతలతో బైడెన్ సమావేశాన్ని రద్దు చేసినట్లు జోర్డాన్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఐమన్ సఫాదీ బుధవారం ఓ ప్రకటన తెలిపారు. యుద్ధాన్ని ఆపడమే ఈ సమావేశం అజెండాగా తెలిపారు. పలస్తీనా ప్రజలను గౌరవించడం, అవసరమైన సాయాన్ని వారికి అందించడం తక్షణావశ్యమని నొక్కిచెప్పారు. పలస్తీనా, ఈజిప్టు, అమెరికాతో సంప్రదింపుల తర్వాతే సమావేశాన్ని రద్దు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. యుద్ధాన్ని ఆపేందుకు, మానవతా సాయం గాజాకు అందజేసేందుకు, విపత్తుకర పరిస్థితికి అంతం పలికేందుకు అవకాశముప్పుడు ఈ సమావేశాన్ని నిర్వహిస్తామని సఫాదీ చెప్పారు.

జోర్డాన్‌లో బైడెన్ పర్యటించబోరన్నారు. ఈ మారణహోమాన్ని ఆపాలని అంతర్జాతీయ సమాజానికి సఫాదీ పిలుపునిచ్చారు. బైడెన్‌తో భేటీని పలస్తీనా అధినేత మహమూద్ అబ్బాస్ రద్దు చేసినట్లు ఓ సీనియర్ అధికారి ప్రకటించారు. గాజా ఆసుపత్రిపై దాడిపై సౌదీ అరేబియా, ఈజిప్టు కూడా ఆగ్రహం వ్యక్తంచేశాయి.

పౌరులపై ఇజ్రాయిల్ దాడులకు ఐరాస, డబ్ల్యూహెచ్ఓ ఖండన

ఆసుపత్రిపై దాడిని ఐక్యరాజ్య సమితితో పాటు ప్రపంచ ఆరోగ్యసంస్థ ఖండించింది. సామాన్యుల ప్రాణనష్టాన్నీ ఆక్షేపించాయి. మానవతా సాయం బాధితులకు చేరకుండా అడ్డుకుంటున్నట్లు ఐరాస ఆరోపించింది. నాలుగు వేల మంది శరణార్థులు ఉన్న తమ స్కూళ్లలో ఒకదానిపై ఇజ్రాయిల్ దాడి చేసిందని, ఆరుగురు చనిపోగా అనేకమంది గాయపడ్డారని వెల్లడించింది. దీనిపై నివేదికలు పరిశీలిస్తామని ఐడీఎఫ్ తెలిపింది.

రాఫా క్రాసింగ్ వద్ద బాంబులను ఇజ్రాయిల్ వేసిందని ఐరాస ఆరోపించింది. గాజా స్ట్రిప్‌లోని అల్ అహ్లీ అరబ్ హాస్పిటల్‌పై దాడిని డబ్ల్యూహెచ్ఓ తీవ్రంగా ఖండించింది. వైద్యారోగ్య సిబ్బంది రక్షణకు అంతర్జాతీయ చట్టాలు సూచిస్తాయని, ఇజ్రాయిల్ వాటిని పరిగణనలోకి తీసుకోవడంలేదని స్పష్టమవుతోందని ఆగ్రహం వ్యక్తంచేసింది. దాడి జరిగినప్పుడు ఆసుపత్రిలో రోగులు, వైద్య సిబ్బందితో పాటు పలస్తీనా శరణార్థులు ఉన్నట్లు వెల్లడించింది.

త్వరలో ఇజ్రాయిల్‌కు రిషి సునాక్

బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ త్వరలో ఇజ్రాయిల్‌లో పర్యటించనున్నారు. ఈ వారంలో సునాక్ పర్యటన ఉంటుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. గతవారం బ్రిటన్ విదేశాంగ మంత్రి జేమ్స్ క్లెవర్లీ టెల్‌అవీవ్‌లో పర్యటించారు. ఇజ్రాయిల్‌కు సంఘీభావం తెలిపారు.

శిశు సంక్షేమశాఖలో ఖాళీల భర్తీ

- సంపూర్ణ పోషణ అమలుపై నిత్య పర్యవేక్షణ
- సీఎం జగన్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: శిశు సంక్షేమశాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బుధవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమంపై సీఎం జగన్ సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని నిశితంగా పర్యవేక్షించాలని, అంగన్ వాడీలలో సూపర్ వైజరీ వ్యవస్థ ఎలా పనిచేస్తుందన్నదానిపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, ఇందుకోసం బలమైన ఎస్‌ఓపీని రూపొందించాలని సీఎం జగన్ స్పష్టం చేశారు. డ్రై రేషన్ పంపిణీ పైనా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇప్పుడు అమలవుతున్న విధానంపై నిరంతరం పర్యవేక్షణతో పాటు, రేషన్ నాణ్యత విషయంలో ఎక్కడా లోపాలు ఉండరాదని సీఎం తెలిపారు. ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో ప్రతి ఇంట్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం ఉన్న వారిని గుర్తిస్తున్నందున వారందరికీ కూడా పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మందులు ఇచ్చే బాధ్యతను ఆరోగ్యశాఖ తీసుకుంటుంది. పౌష్టికాహారం ఇచ్చే బాధ్యతను మహిళా, శిశుసంక్షేమ శాఖ చేపట్టాలి. ఈ విషయంలో వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశుసంక్షేమ శాఖ మధ్య సమన్వయం ఉండాలి. అప్పుడే గ్రామస్థాయిలో కూడా పూర్తిస్థాయిలో రక్తహీనతను నివారించగలుగుతామన్నారు. మనం ఇచ్చిన పౌష్టికాహారాన్ని వారు తీసుకుంటున్నారా? లేదా? రక్తహీనత సమస్య తగ్గుతోందా? లేదా? అన్నదానిపై దృష్టిపెట్టాలని సూచించారు. అలాగే సంపూర్ణ పోషణ కింద పౌష్టికాహారం అందిస్తున్న సమయంలోనే గర్భిణులు, పిల్లలకు టీకాలు అందించారా? లేదా? అన్నదానిపై పర్యవేక్షణ చేయాలని, ఒకవేళ టీకాలు మిస్ అయితే వెంటనే వేయించేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ముఖ్యంగా పిల్లలు కూడా వయసుకు తగ్గ బరువు ఉన్నారా? లేదా? అన్నదానిపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎవరైనా పిల్లల్లో పౌష్టికాహారం లోపం ఉంటే, ఆ వివరాలన్నీ ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు అయ్యేలా చూడాలని చెప్పారు. రక్తహీనత, పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించిన వెంటనే, ఆ వివరాలు తీసుకుని మహిళా శిశు సంక్షేమ ద్వారా వారికి పౌష్టికాహారం అందేలా చూడాలని సీఎం అధికారులకు మార్గనిర్దేశనం చేశారు. ప్రతినెలా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేయాలని, జీవన శైలిలో మార్పులు కారణంగా వస్తున్న వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, వ్యాయామాలపై క్యాంపులు నిర్వహించేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి, ఆర్థికశాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, ఏపీడీడీసీఎఫ్ ఎండీ అహ్మద్ బాబు, పాఠశాల విద్యాశాఖ (మౌలిక వసతుల కల్పన) కమిషనర్ కాటమనేని భాస్కర్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ కమిషనర్ ఎం జానకి, పౌరసరఫరాలశాఖ ఎండీ వీరపాండియన్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ నివాస్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

24న దసరా సెలవు

ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈనెల 24వ తేదీన మంగళవారం దసరా సెలవుగా ప్రకటిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే రాష్ట్రంలోని పాఠశాలలకు దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. నెల 14 నుంచి 24 వరకు దసరా సెలవులు ఇవ్వాలని ఆదేశించింది. 25వ తేదీన పాఠశాల పునఃప్రారంభం కానున్నాయి. 11 రోజులపాటు పాఠశాలలకు దసరా సెలవులు ఇచ్చారు. అటు దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడుపుతోంది. దసరా పండగకు ముందు, పండుగ వెళ్లాక మొత్తంగా 5500 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ఈనెల 13 నుంచి ప్రారంభమైన ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు 26వ తేదీ వరకు రాకపోకలు సాగిస్తాయి.

రామోజీకి, బాబుకు ప్రత్యేక చట్టమా? సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పెంచిన వాళ్లను కాటేయడమే చంద్రబాబు-రామోజీ బుద్ధి అని, వైట్ కాలర్ నేరాల్లో వారిద్దరూ ఆరితేరారని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వారిద్దరి నేరాల్లో సారూప్యత, సామీప్యత కనిపిస్తోందన్నారు. వీళ్లకేమైనా ప్రత్యేకమైన చట్టం, న్యాయం ఉండాలా?, స్కిల్ కుంభకోణంలో పక్కా ఆధారాలతో దొరికినప్పటికీ టీడీపీ పూటకో డ్రామాలాడుతోందని ఆరోపించారు. వందల కోట్ల అవినీతి చేసి కక్షసాధింపు అంటే ఎలా? అని ప్రశ్నించారు. దేశంలో ఎవరికీ లేని హక్కులు ఈ దొంగల ముఠాకు ఎందుకుంటాయని ప్రశ్నించారు. రాజకీయ జీవితం ఇచ్చిన తండ్రి లాంటి ఎన్టీఆర్ ను ముంచింది ఒకరయితే, టైపిస్టుగా చేర్చుకుని వ్యాపారంలో ఆశ్రయమిచ్చి, బతుకునిచ్చిన పెద్దన్నలాంటి జీజే రెడ్డికి పంగనామాలు పెట్టింది మరొకరని సజ్జల వ్యాఖ్యానించారు. రోజుకో డ్రామాతో బాబు అవినీతిని కప్పిపుచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. చంద్రబాబు అరెస్ట్ తర్వాత టీడీపీ నాయకులు, కార్యకర్తలు వ్యవహరిస్తున్న తీరు సాధారణ ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఉందన్నారు. రచ్చకెక్కి అసలు చేసిన అవినీతి బయటకు రాకుండా, ప్రజల దృష్టిని మరల్చి చర్చించకుండా చేస్తున్నారన్నారు. 2014లో టీడీపీకి అధికారం అప్పజెప్తే ఆ పార్టీ అధినేతే ఒక కుంభకోణానికి తెరలేపి దొరికిపోయాడన్నారు. సాంకేతిక పరమైన అంశాలను తెరమీదకు తెచ్చి అవినీతి అంశాన్ని పక్కకు నెట్టేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబుకు జలుబు చేసినా, చర్మవ్యాధులు ఏమైనా ఉంటే వాటిని ప్రాణాంతక వ్యాధి అన్నట్లుగా చూపుతున్నారని సజ్జల చెప్పారు.

'ఉపాధి హామీ' పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలి

సీపీఎం ఎంపీ శివదాసన్

విశాలాంధ్ర-ఏలూరు: పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని సీపీఎం ఎంపీ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు శివదాసన్ తీవ్రంగా విమర్శించారు. ఉపాధిహామీ చట్టం పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బుధవారం ఏలూరులోని శ్రీకాశీవిశ్వేశ్వర కల్యాణమండపంలో బుధవారం సీపీఎం అధ్వర్యాన ఉపాధిహామీ పని దినాలు, వేతనాల పెంపుపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. సదస్సుకు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.రవి అధ్యక్షత వహించారు. ఉపాధిహామీ సమస్యలపై సదస్సులో తీర్మానాలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన శివదాసన్ మాట్లాడుతూ... కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఒకే దేశం - ఒకే చట్టం- ఒకే రేషన్ కార్డు -ఒకే ఆధార్ కార్డు అంటూ నినాదాలు ఇస్తోందని... ఒకే దేశం - ఉపాధి కార్మికులందరికీ ఒకే వేతనం అని ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. కేరళ కంటే ఏపీలో ఉపాధి కూలీలకు తక్కువ వేతనాలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్ నిధుల కోతల ఫలితంగా అడిగిన వారందరికీ పనులు కల్పించలేకపోతున్నారని చెప్పారు. కేరళలో వామపక్ష ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు సంక్షేమబోర్డును ఏర్పాటు చేసి పెన్షన్లు వంటి పథకాలను అమలు చేస్తోందని, విద్య, వైద్యం వ్యవసాయ కార్మిక కుటుంబాలకు అందుబాటులో ఉండే విధంగా కేరళ ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. దేశంలోనే అతి తక్కువ ఫీజులతో కేరళలోని వ్యవసాయ కార్మిక కుటుంబాల పిల్లలు ఉన్నత చదువులు చదువుకోగలుగుతున్నారన్నారు. ఇటీవల కేరళలో బీజేపీ నాయకులు ప్రజలకు చీరలు పంచారని, కాని వ్యవసాయ కార్మిక కుటుంబాలకు కావల్సింది చీరల పంపిణీ కాదని భూముల పంపిణీ కావాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులందరికీ ఉపాధి కల్పించి... కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరింప చేయాలన్నారు. రెండు పూట్ల పనులు రద్దు చేయాలని... సమ్మర్ అలవెన్సు 10 శాతం ఇవ్వాలన్నారు. పని చేసే చోట కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆన్‌లైన్ మస్తర్ రద్దు చేసి పాత పద్ధతిని అమలు చేయాలని, పే స్లిప్పులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, మంతెన సీతారాం, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, రాష్ట్ర నాయకురాలు వి. శివనాగరాణి, సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పోరండ్ల శ్రీనివాస్, సీపీఎం జిల్లా నాయకులు ప్రసాద్, కిషోర్, జి. రాజు, తెల్లం రామకృష్ణ, నాగమణి తదితరులు మాట్లాడారు. వివిధ జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో ఉపాధిహామీ కూలీలు, కార్మికులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంట రుణం ఇవ్వాలి

- సున్నా వడ్డీ పథకం వర్తింపజేయాలి
- ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం డిమాండ్
- రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ కన్వీనర్‌కు వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పంట సాగు హక్కుల కార్డులు (సీసీఆర్‌సీ) పొందిన ప్రతి కౌలు రైతుకు హామీ లేని స్వల్ప కాలిక పంట రుణాలు అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ పంట సాగు దారు హక్కుల చట్టం 2019లో పేర్కొన్న నిబంధనల ప్రకారం కౌలు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులను ఏ ఇతర పత్రాలు లేకుండానే వారికి పంట రుణాలు మంజూరు చేయాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) కన్వీనర్ ఎం.రవీంద్రబాబుకు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం అధ్వర్యంలో సంఘం ప్రతినిధి బృందం విజయవాడ అప్పారావు పేట రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ కార్యాలయంలో రవీంద్రబాబును కలసి వినతిపత్రం అందజేశారు.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) నిబంధనల ప్రకారం రూ.లక్షా 60వేల వరకు ఎలాంటి హామీ లేకుండానే కౌలు రైతులకు పంట రుణాలు అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని అనేక బ్యాంకులకు నివేదించిన విషయం తెలిసిందేనని, అందుకుగాను ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారు హక్కుల చట్టం (2019)ను తీసుకువచ్చారని వివరించారు. ఆ చట్టం ప్రకారం సీసీఆర్‌సీ గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతుల నుంచి ఏ ఇతర పత్రాలు, హామీ లేకుండానే పంట రుణాలు ఇవ్వాలన్న నిబంధనలను చట్టంలో పొందుపర్చారన్నారు. దాని ప్రకారం బ్యాంకులు రుణాలు ఇచ్చి కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు. రుణాలు పొందిన కౌలు రైతులందరికీ సున్నా వడ్డీ పథకాన్ని వర్తింప జేయాలన్నారు. దేవాలయ భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు, లంక భూములు, సొసైటీ భూములు సాగు చేస్తున్న కౌలురైతులకు పంట రుణాలు ఇచ్చి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరారు. సాగు భూముల్లో 80 శాతం కౌలు రైతులే పంటలు పండిస్తున్నారని, సాగు చేస్తున్న భూమి దామాషా ప్రకారం కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని విన్నవించారు. సంస్థాగత రుణాలు అందక పోవడంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద నూటికి రెండు నుంచి ఐదు రూపాయలకు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సాగుచేస్తున్నారని, రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయించుకున్న లక్ష్యం ప్రకారం రూ.4వేల కోట్ల పంట రుణాలు కౌలు రైతులకు అందజేయాలన్నారు. కౌలు రైతులు పడుతున్న ఇబ్బందులను కన్వీనర్ కు వివరించారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రూ లక్షా 60 వేల వరకు ఎలాంటి హామీలు లేకుండానే రుణాలు ఇవ్వాలని చెబుతున్నప్పటికీ, ఏ బ్యాంకు అమలు చేయడం లేదన్నారు. కౌలు రైతులకు పంట హామీగా పంట రుణాలు అందించాలని కోరారు. భూ యాజమాని పంట రుణం తీసుకుంటే కౌలు రైతులకు ఇవ్వలేమని, డబుల్ ఫైనాన్స్ అవుతుందనే సాకుతో కౌలురైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. గతంలో భూయజమాని పంట రుణం తీసుకుని చెల్లించకపోతే దానిని నేరంగా భావించి, కౌలు రైతుకు పంటల రుణాలు ఇవ్వక పోవడం తగదని, ఈ విషయాన్ని పరిశీలించాలని కోరారు. కౌలు గుర్తింపు కార్డు పొందినప్పటికీ, భూ యజమాని వచ్చి సంతకం పెడితేనే పంట రుణాలు ఇస్తామన్న నిబంధనలు సవరించాలన్నారు. సీసీఆర్‌సీ కార్డులు లేని కౌలు రైతులు జాయింట్ లయబిలిటీ గ్రూపులు ఏర్పాటు చేసుకుంటే ఆ గ్రూప్ హామీగా పంటలు రుణాలు ఇవ్వాలని, కౌలు రైతులు రుణం పొందటంలో ఎదుర్కొంటున్న వివిధ అంశాలను కన్వీనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్నీడు యల్లమందారావు మాట్లాడుతూ... మారిన పరిస్థితుల్లో కౌలు రైతులే సేద్యం చేస్తున్నారని, ఉదారంగా కౌలు రైతులకు పంట రుణాలు ఇచ్చి వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాలనుంచి కౌలు రైతులను రక్షించాలని కోరారు. కౌలు రైతులు లేనిదే, రాష్ట్రంలో వ్యవసాయమే లేదని, దీంతో వారికి రుణాలు ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో నేతలు పి.జమలయ్య, యల్లమందారావుతో పాటు కౌలు రైతులసంఘం రాష్ట్ర నాయకులు పెయ్యల వెంకటేశ్వరరావు, చింతల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి నుంచే పాలన జరగాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

విశాలాంధ్ర-ఏలూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశాఖకు మకాం మారుస్తానని ప్రకటించడాన్ని ప్రజలు స్వాగతించడం లేదని... అమరావతి నుంచే రాష్ట్ర పరిపాలన సాగాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం ఏలూరులోని ఉద్దరాజు రామం భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... మూడు రాజధానుల బిల్లును ఉపసంహరించుకున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వమే అసెంబ్లీలో ప్రకటించిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్ ఎక్కడైనా ఉండవచ్చు కానీ అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలను విశాఖపట్నం మారుస్తానంటే ప్రజలు హర్షించరని హితవు పలికారు. అసైన్డ్ భూములకు పట్టాలిచ్చి అమ్ముకునే హక్కులు కల్పిస్తామని చెప్పడం ద్వారా వాస్తవ అసైన్డ్ లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. వాస్తవ లబ్ధిదారులకు, వారి వారసులకే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళల పేరుతో అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో కరువు తీవ్రంగా ఉందని... కృష్ణా డెల్టా పరిధిలో ఏలూరు, బాపట్ల,కృష్ణా, గుంటూరు తదితర జిల్లాల్లో వేలాది ఎకరాలలో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు వ్యవసాయానికి కరెంటు కోతలు తీవ్రంగా ఉన్నాయని చెప్పారు. పట్టిసీమ ద్వారా సాగునీరు అందించి పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. చంద్రబాబు ములాఖత్ విషయంలో ఆంక్షలు విధించడం సరికాదన్నారు. మాజీ మంత్రులను, మాజీ ఎమ్మెల్యేలను అరెస్టులు చేయడం దారుణమని ఖండించారు. బీజేపీ రాష్ట్రంలో బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో మద్యం కుంభకోణంపై సీబీఐ దర్యాప్తుకు కేంద్రం ఎందుకు ఆదేశించలేదని ప్రశ్నించారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని బలపరుస్తూ ఎన్డీఏలో జనసేన ఏ విధంగా భాగస్వామ్యం అవుతుందో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న కేంద్రాన్ని ప్రశ్నించాలని కోరారు.

ఎనర్జీ అసిస్టెంట్ల విధులపై స్పష్టతివ్వాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గ్రామ సచివాలయం పరిధిలో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లు, వారి ఉద్యోగ పట్టిక ప్రకారం విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ జేఏసీ అమరావతి అనుబంధంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ డిమాండ్ చేసింది. వీరు గ్రామ సచివాలయం ఉద్యోగులా?, లేక విద్యుత్ డిస్కమ్ ఉద్యోగులా? అన్నది తేల్చాలని కోరింది. విజయవాడ ఆటోనగర్‌లోని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ (జీఎస్ఎస్) ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్‌ను ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వి.అర్లయ్య, సంఘ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగుల సమస్యలు తెలిపారు. ఎనర్జీ అసిస్టెంట్లు జీతభత్యాలు 010 పద్దు కింద చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కారుణ్య నియామకాల ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలు పొందిన వారికి కన్సాలిడేట్ వేతనాలు కాకుండా క్రమబద్ధీకరించిన వేతనాలు ఇవ్వాలని కోరారు. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పేరు మార్చాలన్నారు. వెల్ఫేర్- ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు, వార్డు ఎడ్యుకేషన్-డేటా ప్రాసెసింగ్ సెక్రెటరీలకు పదోన్నతి కల్పించాలని కోరారు. నిలిపివేసిన అగ్రికల్చర్, హార్టీకల్చర్ తదితర అనుబంధ విభాగాల ఉద్యోగులు బదిలీలను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రొబేషన్ ఆలస్యమై మొదటి, రెండో విడతలలో కోల్పోయిన తొమ్మిది, ఐదు నెలల లెక్కన బకాయిలు ఇవ్వాలని, సీనియార్టీ తదితర అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి కో-చైర్మన్ ఎస్.మల్లేశ్వర రావు, ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.జ్యోతి, సీహెచ్ హరి, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు డీవీఎస్ సురేశ్, ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మల్లికార్జున్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సీవీ మంజునాథ్ పాల్గొన్నారు.

'ఒక జిల్లా - ఒక ఉత్పత్తి' గుర్తింపులో ఏపీ ముందడుగు

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' గుర్తింపు కార్యక్రమంలో ఏపీ తన ప్రత్యేకతను రుజువు చేసుకునే దిశగా ముందడుగు వేస్తోందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ (చేనేత, జౌళి) ముఖ్య కార్యదర్శి సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని అన్ని జిల్లాల సామాజిక ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో, ప్రతి జిల్లా నుండి ఒక ఉత్పత్తిని ఎంపిక చేసి... ప్రత్యేక గుర్తింపునివ్వడం ద్వారా విస్తృత ప్రచారం కల్పించటం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఏపీ నుండి హస్తకళలు, చేనేత, జౌళి, మత్స్య, పారిశ్రామిక రంగాలకు చెందిన 26 విభిన్న అంశాలపై దరఖాస్తు చేయగా తుదిదశ పరిశీలన తరు వాత 14 అంశాలు భౌతిక ధృవీకరణను సైతం పూర్తి చేసుకున్నాయన్నారు. దేశ వ్యాప్తంగా 64 ఉత్పత్తులను భౌతిక ధృవీకరణ కోసం ఎంపిక చేయగా... రాష్ట్రం నుండి గణనీయంగా 14 ఉత్పత్తులు ఉండటం ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతుందని సునీత వివరించారు. 2023-24 సంవత్సరానికి వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ అవార్డుల తుది ఎంపిక కోసం ఇన్వెస్ట్ ఇండియా బృందం ఈ నెల 10వ తేదీ నుండి రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి పరిశీలన బుధవారంతో ముగిసిందన్నారు.

బాలల దినాన్ని ప్రభుత్వమే నిర్వహించాలి

ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖపట్నంలో ప్రభుత్వమే వేడుకలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబరులో విజయనగరం, పార్వతీపురం, మన్యం జిల్లాలో జగన్ పర్యటించినప్పుడు నవంబరు 14న బాలల దినోత్సవాన్ని విశాఖపట్నంలో ప్రభుత్వపరంగా నిర్వహించాలని కోరినట్లు గుర్తుచేశారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్‌కు, రెండు శాఖల ముఖ్య కార్యదర్శుల దృష్టికి విషయాన్నిత తీసుకెళ్లినట్లు తెలిపారు.

చంద్రబాబు అరెస్ట్ కుట్రను కేంద్రానికి తెలపండి

గవర్నర్‌కు టీడీపీ నేతల వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అరెస్ట్ వెనకున్న రాజకీయ కుట్రల్ని, ఆధారాల్లేని కేసుల్లో జైలుకు పంపిన వైనాన్ని కేంద్రప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని గవర్నర్‌కు టీడీపీ నేతలు కోరారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, శాసనమండలిలో టీడీపీ పక్షనేత యనమల రామకృష్ణుడు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, బొండా ఉమామహేశ్వరరావు, ఎం.ఎ.షరీఫ్ పంచుమర్తి అనురాధ, పరుచూరి అశోక్ బాబు, శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావు తదితరులు బుధవారం సాయంత్రం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం అచ్చెన్నాయుడు, యనమల మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుపై వైసీపీ ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసుల పూర్తి వాస్తవాలను గవర్నర్ ముందుర ఉంచినట్లు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు, ఫైబర్‌నెట్ ప్రాజెక్టు, ఇన్నర్ రింగ్‌రోడ్‌పై ప్రభుత్వం చేస్తున్న నిరాధార ఆరోపణలను తిప్పికొడుతూ వాస్తవాలను గవర్నర్‌కు తెలిపినట్లు చెప్పారు. రాష్ట్రంలో సాగుతున్న అరాచకాలు, అకృత్యాలను నిరోధించాలని, ప్రజలకు సంక్రమించిన రాజ్యాంగ, ప్రజాస్వామ్యమైన హక్కుల్ని, న్యాయాన్ని కాపాడాలని కోరినట్లు తెలిపారు. జగన్ ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక చర్యలతో పాటు, ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనారిటీలు ఇతర వర్గాలపై దాడులు, పోలీస్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని సాగిస్తున్న దుర్మార్గాలను, రాజ్యాంగ వ్యవస్థల్ని వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగిస్తున్న వైనాన్ని వివరించామన్నారు. చంద్రబాబుపై పెట్టిన తప్పుడు కేసులు, అన్యాయంగా జైలుకు పంపిన విధానాన్ని ఆధారాలతో సహా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. సమాచారం మొత్తాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, సమగ్ర నివేదికను కేంద్రానికి ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. గవర్నర్ కూడా సానుకూలంగా స్పందించారన్నారు. చంద్రబాబుపై కేసులు.. వాటి విచారణ గురించి తెలుసునని చెప్పారని నేతలు తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఐడీని, పోలీస్ వ్యవస్థను జేబు సంస్థలుగా మార్చుకొని టీడీపీ నేతలపై, గిట్టని మీడియా సంస్థలపై, వాటి యాజమాన్యాలపై ఏ విధంగా తప్పుడు కేసులు పెట్టిస్తున్నారు, ఎలా రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతున్నారన్నది గవర్నర్‌కు తెలిపినట్లు వెల్లడించారు.

ఐఆర్ఆర్ కేసు విచారణ 7కు వాయిదా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను హైకోర్టు నవంబర్ 7కు వాయిదా వేసింది. సుప్రీం కోర్టులో క్వాష్ పిటిషన్‌పై తీర్పు రిజర్వులో ఉన్నందున కేసుని వాయిదా వేశారు. అమరావతి రింగ్ రోడ్డు కేసులో పీటీ వారెంట్‌ను సీఐడీ అధికారులు గతంలో విజయవాడ ఏసీబీ కోర్టులో దాఖలు చేశారు. పీటీ వారెంట్ విచారణ పై స్టే విధిస్తూ గతంలోనే హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా ఆ ఉత్తర్వులను సైతం నవంబర్ 7 వరకు పొడిగించింది.

ఆదిరెడ్డి అప్పారావు బెయిల్ రద్దుకు సుప్రీం నిరాకరణ

టీడీపీ నేత ఆదిరెడ్డి అప్పారావుకు బెయిల్ రద్దు చేయడానికి సుప్రీం నిరాకరించింది. జగత్ జనని చిట్ ఫండ్ కంపెనీలో అక్రమాలు ఆరోపణలతో ఆదిరెడ్డి అప్పారావు, ఆయన కుమారుడు ఆదిరెడ్డి వాసును సీఐడీ అరెస్ట్ చేసింది. అయితే ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి వాసుకు ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో హైకోర్టు తీర్పును సీఐడీ సుప్రీంలో సవాలు చేసింది. బుధవారం ఈ పిటిషన్‌పై సుప్రీంలో విచారణకు రాగా సీఐడీ తరపు న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలను వినిపించారు. ఆదిరెడ్డి అప్పారావు తరపున సీనియర్ కౌన్సిల్ సిద్ధార్థ లూథ్రా హాజరయ్యారు. విచారణకు సహకరించాలని ఆదిరెడ్డి అప్పారావుకు సుప్రీం సూచించగా... సిద్ధార్థ లూథ్రా హామీ ఇచ్చారు. దీంతో ఆదిరెడ్డి అప్పారావు బెయిల్ రద్దుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

సంపాదకీయం

న్యాయం చేయని తీర్పు

స్వలింగులు పెళ్లి చేసుకోవచ్చునా లేదా, అది చట్టబద్ధమైందా కాదా, స్వలింగులు కలిసి జీవిస్తే వారికి ఇతర దంపతులకు ఉండే హక్కులే ఉంటాయా లేదా అన్న విషయంలో అయిదుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ బెంచి మంగళవారం చెప్పిన తీర్పు అంతిమంగా నిరాశే మిగిల్చింది. ఈ అయిదుగురు న్యాయమూర్తులలో ముగ్గురు న్యాయమూర్తులు ఒక రకమైన తీర్పు చెప్తే మిగతా ఇద్దరు భిన్నమైన తీర్పు చెప్పారు. ఇలా ఏకాభిప్రాయంలేని తీర్పులు కొత్త కాదు. ఎక్కువ మంది న్యాయమూర్తులు ఎటు మొగ్గితే చివరకు దాన్నే తీర్పుగా పరిగణిస్తారు. స్వలింగులకు వివాహ హక్కు ఉందా లేదా అన్న విషయంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్, సంజయ్ కిషన్ కౌల్ ఇచ్చింది మైనారిటీ తీర్పే. అయితే మైనారిటీ తీర్పులోని అంశాలు కాలక్రమంలో శాసన రూపం తీసుకున్న సందర్భాలూ ఉన్నాయి. న్యాయమూర్తులు రవీంద్ర భట్, పి.ఎస్. నరసిమ్హ, హిమ కొహ్లీ భిన్నమైన తీర్పు చెప్పారు. అయితే ఈ ముగ్గురి అభిప్రాయం మెజారిటీ అభిప్రాయం కనక అదే అంతిమ తీర్పు అవుతుంది. ఇద్దరు న్యాయమూర్తులు ఒక రకమైన తీర్పు, ముగ్గురు న్యాయమూర్తులు మరో రకమైన తీర్పు ఇచ్చారు అనుకున్నా అయిదుగురు కలిసి మొత్తం నాలుగు తీర్పులు వెలువరించారు. కొన్ని అంశాలలో మైనారిటీ న్యాయమూర్తుల అభిప్రాయంతో మెజారిటీ న్యాయమూర్తులూ అంగీకరిస్తే మరికొన్ని విషయాలలో భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేశారు. ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయంతో మెజారిటీ న్యాయమూర్తులు అంగీకరించని అంశాన్ని ప్రత్యేకంగా గమనించవలసి ఉంటుంది. దీన్నిబట్టి ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయం మెజారిటీ తీర్పు కావాలన్న నియమం ఏమీ లేదు. మొత్తంమీద ఈ తీర్పు స్వలింగులు పెళ్లి చేసుకోవచ్చునా లేదా ఒకవేళ పెళ్లాడితే దానికి పెళ్లితో ముడిపడ్డ హక్కులు, బాధ్యతలు వర్తిస్తాయా లేదా అన్న విషయాన్ని నిర్ణయించే అవకాశాన్ని పార్లమెంటుకు, ప్రభుత్వానికి వదిలేశారు. స్వలింగులు పెళ్లి చేసుకోవడాన్ని చట్టం అంగీకరిస్తుందా లేదా అన్న విషయంతో నిమిత్తం లేకుండానే మన దేశంలో ఇలాంటి పెళ్లిళ్లు చాలా కాలంగా జరుగుతూనే ఉన్నాయి. 1980లు, 1990లలో ఇలాంటి పెళ్లిళ్లు ఎక్కువే కనిపిస్తున్నాయి. కోర్టు తీర్పుతో నిమిత్తం లేకుండానే ఈ రకమైన పెళ్లిళ్ళు జరుగుతూనే ఉంటాయి. నిజానికి ఇలాంటి పెళ్లిళ్లు చేసుకునేవారు కోర్టు తీర్పుకోసం వేచిచూడడం లేదు. ఈ అంశంలో చట్టంచేసే అధికారం తమకు లేదని ఆ పని చేయవలసింది పార్లమెంటు అని తాజా తీర్పు స్పష్టం చేసింది. ఈ అంశాలను, చర్చించి నిర్ణయించవలసింది పార్లమెంటే అని తేల్చేశారు. స్వలింగులు వివాహం చేసుకోవడాన్ని ఒక హక్కుగా గుర్తించేట్టు చేయడానికి జరుగుతున్న ఉద్యమంమీద ఈ తీర్పు నీళ్లు చల్లింది. అంటే స్వలింగ వివాహాలకోసం పోరాడుతున్న వారు ఉద్యమం మళ్లీ కొనసాగించవలసి వస్తుంది. వీధి పోరాటాలకు దిగాల్సి ఉంటుంది. ఏమైనా ఇక మిగిలింది సుదీర్ఘ పోరాటమే. ఇతర దేశాలలో స్వలింగ వివాహాలు చట్టబద్ధం కాకముందే మన దేశంలో స్వలింగ వివాహాలకోసం ఉద్యమం మొదలైంది. ప్రపంచంలో 23 దేశాలు స్వలింగ వివాహాలను చట్టబద్ధం చేశాయి. కొన్ని దేశాలలో ప్రజాభిప్రాయం ఆధారంగా చట్టబద్ధంచేస్తే మరికొన్ని దేశాలు న్యాయస్థానాల తీర్పు ప్రకారం చట్టబద్ధం చేశాయి. స్వలింగ వివాహాలకోసం పోరాడుతున్నవారు 1991 నుంచి ఉద్యమం ప్రారంభించారు. 1970లు, 1980లలో కూడా ఇలాంటి పెళ్లిళ్లు జరిగాయని చెప్తున్నారు. మగ, ఆడ మధ్య జరిగేదే పెళ్లి అన్న భావన సమాజంలో పాతుకుపోయి ఉంది.

అయితే మద్రాస్ హైకోర్టు 2019లో ఒక పురుషుడు, లింగ మార్పిడి చేసుకున్న వ్యక్తిని పెళ్లాడవచ్చునని తీర్పు చెప్పింది. ఇప్పుడు సుప్రీంకోర్టు పరిశీలించిన విషయం స్వలింగుల వివాహం చట్టబద్ధం అవునా కాదా అన్నదే. ఆ వ్యవహారాన్ని తేల్చాల్సిన బాధ్యతను అత్యున్నత న్యాయస్థానం పార్లమెంటుమీద, ప్రభుత్వంమీద మోపింది. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం స్త్రీ, పురుషుల మధ్య మాత్రమే పెళ్లి జరగాలని భావిస్తోంది. పైగా ఆడ, మగ కాకుండా ఇతరులను, అంటే లింగ మార్పిడి చేసుకున్న వారిని, అలింగులను, స్వలింగులను పెళ్లి చేసుకోవాలన్న భావన పట్టణ ప్రాంతంలోని శిష్ట వర్గానికి పరిమితమైన సమస్య అని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఈ అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు అంగీకరించలేదు. కానీ అంతిమ నిర్ణయం ప్రభుత్వానిది, పార్లమెంటుది అని చెప్పడం ద్వారా ఈ కేసులో తీర్పు చెప్పినా న్యాయం మాత్రంచేయలేదు. దీన్నిబట్టి న్యాయాన్యాయాలను పట్టించుకోకుండా వదిలేసింది. ఒక అంశాన్ని రాజ్యాంగ నైతికత దృష్టితో చూడాలా, జన నైతికం అనుకునే దృక్కోణంతో చూడాలా అనే విషయాన్ని తేల్చాల్సిన సందర్భంలో ఆ బాధ్యత నుంచి తప్పించుకుంది. వైవాహిక, లైంగిక సంబంధాల దగ్గరకొచ్చేటప్పటికి విపరీత వైఖరిని, ప్రవృత్తిని, విధానాన్ని సుప్రీంకోర్టు న్యాయపరంగా పరిశీలించకుండా ఆ బాధ్యతను ప్రభుత్వనికి, పార్లమెంటుకు వదిలేసింది. శాసనాలు రూపొందించే అవకాశం న్యాయవ్యవస్థకు లేకపోవచ్చు. కానీ న్యాయాన్యాలను వివేచించి తీర్పు చెప్పే బాధ్యతను కూడా అత్యున్నత న్యాయస్థానం నిర్వర్తించలేదు. అంటే వ్యక్తుల పెళ్లిళ్లు, సహజీవనం మొదలైనవి ప్రభుత్వం నిర్ణయించే అంశాలుగా సుప్రీంకోర్టు భావించినట్టు కనిపిస్తోంది. అయితే న్యాయమూర్తులు భిన్నమైన తీర్పులు చెప్పినప్పటికీ కొన్ని విషయాలలో ఏకాభిప్రాయం వ్యక్తంచేశారు. ఇలాంటి కేసును విచారణకు అర్హమైంది అనుకోవడం మనుషుల్లో విపరీత ప్రవర్తన సహజమైందని భావించడం ఇది పట్టణ, గ్రామీణ అన్న తేడాలతో సంబంధం లేనిదని భావించడంలో ఏకాభిప్రాయం ప్రదర్శించారు. పెళ్లి చేసుకోవడం ప్రాథమిక హక్కు కాదని కూడా ఏకాభిప్రాయం వ్యక్తంచేశారు. అలాగే ప్రత్యేక వివాహచట్టం రాజ్యాంగ వ్యతిరేకమైంది కాదని, అయితే విపరీత ప్రవర్తన ఉన్న వారి మధ్య పెళ్లికి అవకాశం ఇచ్చేది కాదని కూడా న్యాయమూర్తులు భావించారు. ప్రస్తుత చట్టాల ప్రకారం, లింగ మార్పిడి చేసుకున్న వారు ఆడ, మగ అయితే సంబంధాలు పెట్టుకోవడానికి చట్టం అనుమతిస్తుందని కూడా న్యాయమూర్తులు అంగీకరించారు. స్వలింగులు పెళ్లిచేసుకోవడం దగ్గరకు వచ్చేసరికి అయిదుగురు న్యాయమూర్తులు చేతులెత్తేశారు. ఈ విషయంలో మైనారిటీ తీర్పుచెప్పిన ఇద్దరు న్యాయ మూర్తులు మిగతా ముగ్గురిని ఒప్పించలేకపోయారు. దీనివల్ల పిటిషనర్లకు కొద్దిగానైనా ఊరట కలిగించలేకపోయారు. మైనారిటీ తీర్పుచెప్పిన ఇద్దరు న్యాయమూర్తులు పెళ్లిచేసుకోవడం ప్రాథమిక హక్కు కాదంటూనే మన రాజ్యాంగ విలువల ప్రకారం వ్యక్తుల అభీష్టానికి విలువ ఇవ్వాలని, వారికి పెళ్లి చేసుకునే హక్కు ఉండాలని అభిప్రాయపడ్డారు. అయితే ఈ హక్కుని చట్టబద్ధంచేసే బాధ్యతను ప్రభుత్వానికి, పార్లమెంటుకు అప్పగించారు. రాజ్యాంగం ప్రకారం కలిసి జీవించే, సంబంధం ఏర్పరుచుకునే హక్కు ఉందనుకున్నా దాన్ని ఒక వ్యవస్థగా పరిగణించలేమని మెజారిటీ తీర్పు చెప్పిన న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. పెళ్లి ఆడ,మగ మధ్యేనన్న సామాజిక నీతి బలంగా ఉండడమే న్యాయమూర్తులు నికరమైన తీర్పు ఇవ్వడానికి అవరోధంగా మారినట్టుంది.

యుద్ధం తీవ్రమయ్యే అవకాశం..!

నిత్య చక్రవర్తి

హమాస్-ఇజ్రాయిల్ మధ్య యుద్ధం మరింత తీవ్రమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. యుద్ధం ప్రారంభమై 12రోజులైంది. సుదీర్ఘకాలంగా స్వతంత్ర దేశంకోసం పోరాడి విసిగి వేసారిన పలస్తీనా యువత ఆగ్రహంతో ఇజ్రాయిల్‌పైన దాడిచేసింది. ఫలితంగా ప్రాణ, ఆస్తినష్టం జరిగినమాట వాస్తవమేగానీ, దాదాపు 75సంవత్సరాలుగా పలస్తీనా పడుతున్న బాధలు ఎవరికీ గుర్తురాలేదు. హమాస్‌దే తప్పుగా చేసి ఇజ్రాయిల్‌ని వెనకేసుకొస్తున్నారు. ఏనాడూ శాంతి ఆలోచనలులేని అమెరికా ఇజ్రాయిల్‌కు ఆయుధాలు, నిధులు భారీగా సమకూర్చి తన నైజం ఏమిటో బైటపెట్టింది. ఐక్యరాజ్యసమితి పలస్తీనా స్వతంత్ర దేశంగా అవతరించడానికి చాలాసార్లు తీర్మానాలు చేసినప్పటికీ వాటిని ఇజ్రాయిల్ అమలు జరపలేదు. ఈ యుద్ధంలో ఇంతవరకు 3000మందికిపైగా పలస్తీనా ప్రజలు హతులయ్యారు. మంగళవారం రాత్రిపూట ఇజ్రాయిల్ సైనికులు గాజాప్రాంతంలోని ఆసుపత్రిపై బాంబులు వేయడంతో 500 మందికిపైగా ఒకేసారి ప్రాణాలు వదిలారు. ఇజ్రాయిల్‌లో దాదాపు 1400మంది మరణించారు. ఇజ్రాయిల్-అరబ్ దేశాల మధ్య ఇంతవరకు జరిగిన యుద్ధాలలో తాజాగా జరిగిన యుద్ధంలో మరణించినంతమంది ఏనాడూ చనిపోలేదు. దాదాపు సంవత్సరంన్నరకుపైగా ఉక్రెయిన్-రష్యా మధ్య జరుగుతున్న యుద్ధం కాస్త వెనకపట్టుపట్టినట్లు అనిపిస్తోంది. ఇదిలాఉండగా, అకస్మికంగా హమస్-ఇజ్రాయిల్ మధ్య సాయుధ ఘర్షణ తీవ్రమైంది. ఒక్కసారి ప్రజ్వరిల్లిన యుద్ధం ఐక్యరాజ్యసమితితో సహా అనేక అంతర్జాతీయ సంస్థలు దిగ్భ్రాంతికి గురయ్యాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇజ్రాయిల్‌లో బుధవారం పర్యటించారు. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహును బైడెన్ కలుసుకుని తమ పూర్తి మద్దతును ప్రకటించారు. హమస్‌ను పూర్తిగా నిర్మూలించేవరకు యుద్ధం ఆగబోదని నెతన్యాహు ప్రకటించారు. గాజా స్ట్రిప్‌నుండి పలస్తీనా ప్రజలను పూర్తిగా ఖాళీచేయించి ఆ ప్రాంతాన్ని హస్తగతం చేసుకోవాలన్న చెడుతలంపు నెతన్యాహుకు ఏర్పడిందని చెబుతున్నారు.

గాజా ప్రాంతంమీద పూర్తిస్థాయిలో యుద్ధప్రకటన చేసిన ఇజ్రాయిల్‌పై ఇస్లాం దేశాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఒకేసారి బాంబులు కురిపించే ఉద్దేశంతో ఇజ్రాయిల్ తనయుద్ధ ట్యాంకులను గాజా సరిహద్దుల్లో ఇప్పటికే మోహరించింది. గాజాప్రాంతంలో నివసిస్తున్న దాదాపు 23లక్షలమందిని అక్కడనుండి ఖాళీ చేయవలసిందిగా ఇజ్రాయిల్ ఇప్పటికే బెదిరించింది. కొన్ని లక్షలమంది గాజా ప్రాంతాన్ని

వదలి సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు. 4లక్షల మంది ఖాళీచేసి వెళ్లిపోయారని ఐక్యరాజ్యసమితి అంచనావేసింది. గాజాలో జనం ఆకలిదప్పులతో అల్లాడుతున్నారు. ఆసుపత్రి సేవలన్నీ కుప్పకూలిపోయాయి. విద్యుత్తు, నీటిసరఫరా దాదాపు ఆగిపోయింది. ఇజ్రాయిల్ సైన్యం వేసిన బాంబులు, రాకెట్ల దాడులు ఈ విధ్వంసానికి కారణం. బైడెన్ టెలిఅవీవ్‌లో పర్యటిస్తున్న సందర్భంలోనే చమురు ఉత్పత్తిదేశాలు దోహాలో సమావేశం అయ్యాయి. రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్‌పుతిన్ ఇప్పటికే బీజింగ్ చేరుకున్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పుతిన్‌తో భేటీ అవుతారు. యుద్ధం పట్ల ఆందోళన చెందుతున్న దేశాలన్నీ చర్చలు జరుపుతున్నాయి. కాల్పుల విరమణకు ఒక ఒడంబడిక జరుగుతుందా అని ఎదురు చూస్తున్నారు. యుద్ధం కొనసాగుతుందా లేక కాల్పుల విరమణ జరుగుతుందా అని ఎదురుచూస్తున్నారు.

బైడెన్‌కు షాక్:

బైడెన్ టెలిఅవీవ్‌లో పర్యటించాక జోర్డాన్‌ను సందర్శించాలని కార్యక్రమం నిర్ణయించారు. అయితే గాజాప్రాంతంలోని ఆసుపత్రిపై ఇజ్రాయిల్ సైన్యం బాంబులువేసి 500మందికిపైగా చికిత్సపొందుతున్న ప్రజలను హతమార్చడంతో జోర్డాన్ అధ్యక్షుడు ఈ పర్యటనను రద్దుచేశారు. బైడెన్‌తో మాట్లాడేందుకు కూడా జోర్డాన్ అధ్యక్షుడు ఇష్టపడకుండా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇజ్రాయిల్ తన దుర్మార్గపు కార్యకలాపాలను రద్దుచేస్తేనే బైడెన్‌తో తానుమాట్లాడగలనని జోర్డాన్ అధ్యక్షుడు ప్రకటించాడు. జోర్డాన్ అధ్యక్షుడి అకస్మిక నిర్ణయం బైడెన్‌కి షాక్ తగిలింది. జోర్డాన్ అధ్యక్షుడు ఏకపక్ష నిర్ణయం కావడంతో బైడెన్‌కి గట్టి దెబ్బ. బైడెన్ టెలిఅవీవ్‌కి వచ్చిన సందర్భంగా ఇజ్రాయిల్ తదితర ప్రపంచ దేశాల రాయబార కార్యాలయాలముందు భారీగా నిరసన ప్రదర్శనలు జరిపారు. పశ్చిమాసియాలో జరుగుతున్న ఈ యుద్ధం అక్టోబరు 18న కీలకపరిణామానికి దారితీయవచ్చునని భావిస్తున్నారు. చర్చలమూలంగా సానుకూల ఒప్పందం జరగకపోతే యుద్ధం కొనసాగడమేకాక, ఇందులో లెబనాన్‌కు చెందిన హెజ్బుల్లా మిలిటెంట్లు జోక్యం చేసుకోనున్నారు. దోహాలో జరిగిన సమావేశానికి సౌదీ అరేబియా కూడా హాజరైంది. యుద్ధపిపాస కలిగిన బైడెన్ ఇజ్రాయిల్ నిర్బంధించిన పలస్తీనా ప్రజలను వదిలిపెట్టవలసిందిగా నెతన్యాహుపైన సౌదీ వత్తిడిచేయగలిగితే ఏదో ఒక విధంగా యుద్ధం ఆగవచ్చు.

2024 నవంబరులో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్న తరుణంలో బైడెన్‌కు ఈ యుద్ధం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రిపబ్లికన్ పార్టీతరపున అధ్యక్ష పదవికి పోటీచేసే అవకాశం ఉంది. హమస్ మిలిటెంట్లపైన గట్టిచర్య తీసుకోలేని వెన్నెముకలేని బైడెన్ అంటూ విమర్శలు గుప్పించారు. మరోవైపు ట్రంప్ టెర్రరిజం, అందులో ముస్లింలు పనిచేయడంలాంటి అంశాలను తీసుకుని విమర్శలు చేస్తున్నారు. చమురు ఉత్పత్తిదేశాలు యుద్ధం కొనసాగితే తీసుకోవలసిన చర్యలను చర్చిస్తున్నారు. ఈ దశలో చైనా, రష్యా అధ్యక్షులు ఎలాంటి వైఖరి తీసుకున్నారనేది ప్రశ్నార్థకం.

దశాబ్దకాలంగా విద్యాభివృద్ధిలో వెనుకబడిన తెలంగాణ

డా. యం.సురేష్ బాబు

తెలంగాణలో విద్యారంగం అస్తవ్యస్తంగా ఉంది. పేలవమైన బడ్జెట్ కేటాయింపులు, దిగజారిన ప్రమాణాలు, అవసరమైన సంఖ్యలో ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠశాలల్లో అభ్యాస ఫలితాలు దుర్భరస్థితిలో ఉన్నాయి. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో బోధకుల నియామకాలు ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య రాజకీయ కుమ్ములాటలతో పుణ్యకాలం ముగిసిపోయింది. ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన రాష్ట్రవార్షిక బడ్జెట్ తెలంగాణ విద్యారంగానికి, పేదల చదువుకు దూరం చేసేదిగాఉంది. ఇది రూ.19,093 కోట్లుగా నిర్ణయించబడింది. మొత్తం బడ్జెట్ రూ.2,90,396 కోట్లలో విద్యకు 6.57శాతం. తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం 2014లో అధికారం చేపట్టినప్పటి నుంచి విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు ప్రతి ఏడాది పడిపోతోంది. తెలంగాణ 2014-15లో 10.89శాతం నుండి పతనాన్ని చూసింది. అదే శాతానికి కేటాయిస్తే ఈ ఏడాది ఈ రంగానికి రూ.29,039 కోట్ల ఆదాయం వచ్చేది. తెలంగాణలో విద్యారంగం బడ్జెట్‌లో ఏటా పడిపోతున్నందున, బడ్జెట్‌లో 30శాతం విద్యకు కేటాయించాలని సూచించిన కొఠారి కమిషన్ సిఫార్సులు పాటించడంలో రాష్ట్రం విఫలమైంది.

కేంద్ర బడ్జెట్‌లో ప్రతి సంవత్సరం విద్య కోసం 10శాతం కంటే తక్కువ కేటాయిస్తున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ బడ్జెట్‌లో 6.24శాతం విద్యపై ఖర్చు చేసింది. అఖిల భారత సగటు కేటాయింపు 15.2శాతం (2021-22 బడ్జెట్ అంచనాల ప్రకారం) కంటే చాలా తక్కువ. కేజీ టు పీజీ ఉచితవిద్య అంటూ టీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దఎత్తున హామీలు గుప్పించినా, విద్యారంగానికి కేటాయింపులు మాత్రం తూతూమంత్రంగా మిగిలిపోయాయి. కేసీఆర్ తన కుమారుడి అసెంబ్లీ నియోజకవర్గమైన సిరిసిల్లలో రాష్ట్రంలోని మొట్టమొదటి కేజీ టు పీజీ ఏకైక మోడల్ విద్యాలయాన్ని ప్రారంభించింది. విద్యా రంగానికి కేటాయింపులు పేలవంగా ఉండటం వాటి ప్రభావాన్ని చూపుతోంది. తెలంగాణలో అక్షరాస్యత రేటు 66.54శాతం 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశ సగటు 72.98శాతం కంటే తక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత 67.77శాతం అఖిల భారత సగటుతో పోలిస్తే 57.30శతానికి మరింత తగ్గింది.

గత ఏడాది ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన మన ఊరు-మన బడి/మన బస్తీ-మన బడి పథకం (నా ఊరు-నా పాఠశాల/నా వార్డు-నా పాఠశాల) కేవలం రూ.300 కోట్లు మాత్రమే కేటాయించారు. 12 కాంపోనెంట్‌ల కింద పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ఈ పథకం రూపొందించడమైంది. 70 పాఠశాలల్లో కేవలం 10శాతం నుంచి 15శాతం పనిపూర్తయింది. మిగిలిన 30శాతం పాఠశాలల్లో పనులు ఇంకా ప్రారంభం కాలేదు. 9,123 పాఠశాలల్లో 600 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ విద్యార్థుల ఆందోళనలు - ట్రిపుల్‌ఐటి బాసరలో విద్యార్థుల ఆత్మహత్యలు విశ్వవిద్యాలయ అధికారగణం వార్తల్లో నిలుస్తున్నారు. ఆరు, ఎనిమిది తరగతుల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం, రాష్ట్రంలో పెరిగిన ఆర్థిక సంక్షోభం కారణంగా, అదనంగా 2,35,439 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలను విడిచిపెట్టి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు (నవంబర్ 2021 నాటికి). 2019లో రాష్ట్రంలోని జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత జిల్లాల సంఖ్య 10 నుంచి 33కి,మండలాల సంఖ్య 594కి పెరిగింది. ప్రతి మండలానికి విద్యాధికారి ఉండాలి. అవసరమైన సంఖ్యలో పోస్టులను సృష్టించడానికి, నియామకాలకు ఎటువంటి ప్రయత్నాలు చేయలేదు. పాఠశాలల్లోని సిబ్బందికి పదోన్నతులు, బదిలీల కోసం ప్రభుత్వ పాఠశాలలను అనధికారికంగా హేతుబద్ధీకరణ పాల్పడుతోందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీనివల్ల 1,250 పాఠశాలలు మూతపడ్డాయి. ప్రభుత్వం కొంత కాలం పాటు అర్హత కలిగిన ఉపాధ్యాయులను ప్రాథమిక పాఠశాలల నుండి ఉన్నత పాఠశాలలకు బదిలీ చేసింది. చివరిసారిగా 2015లో పదోన్నతులు కల్పించారు. ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలనే నిబంధనను పాటించకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కనీసం విద్యా వాలంటీర్‌ని, రెగ్యులర్ టీచర్‌ను నియమించాలని కోరుతున్నారు. 1,250 పాఠశాలల్లో ఒకటవ తరగతిలో కొత్త విద్యార్థులు లేరన్నకారణం చూపుతున్న ప్రభుత్వం, బదిలీ విధానంలో భాగంగా ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కేటాయింపును నిలిపివేసింది.

ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షులు

ఐ-మెయిల్

గణాంకాల ప్రాధాన్యత

గణాంకాలు, ఆర్థిక ప్రణాళిక రంగాల్లో ప్రొ.ప్రశాంత చంద్ర మహలనోబిస్ చేసిన విశేషకృషికి గుర్తింపుగా, ఆయన జన్మదినం జూన్ 29 సందర్భంగా, 2007 నుంచి ప్రతి సంవత్సరం "జాతీయ గణాంకాల దినోత్సవం"గా మన భారతప్రభుత్వం జరుపుతోంది. స్వాతంత్ర్యం వచ్చే నాటికి భారతదేశ పరిస్థితి నల్లేరుపై నడకలా లేదు. మనదేశ వనరులను కొల్లగొట్టి ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ కొట్టారు అప్పటి వలస పాలకులు. దేశంలో పరిశ్రమలు లేని కారణంగా నిరుద్యోగం తాండవించింది. దీనికి విరుగుడుగా నాటి ప్రధాన మంత్రి నెహ్రూ ఆలోచనల నుండి పురుడుపోసుకొన్న పంచవర్ష ప్రణాళికల్లో భాగంగా రెండవ పంచవర్ష ప్రణాళికలో పారిశ్రామికీకరణకు పెద్దపీట వేశారు. దాని రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన మహానుభావుడే మహలనోబిస్. పూర్తి పేరు ప్రశాంత్ చంద్ర మహలనోబిస్. ఈయన భారతీయ గణాంక సంస్థ స్థాపకుడు. భారతీయ గణాంక శాస్త్ర పితామహుడు. మహలనోబిస్ చేసిన సేవలుకి గుర్తుగా 2007 సంవత్సరం నుండి ఈయన పుట్టినరోజు జూన్ 29 న జాతీయ గణాంక దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఏ విభాగంలోనైనా, ఏ శాస్త్ర రంగంలోనైనా గణాంకాలకు ఉన్న ప్రాధాన్యత అంతా ఇంత కాదు. దేశ బడ్జెట్ తయారికైనా , జనాభా అంచనాకైనా, సంక్షేమ రంగంలోనైనా, సేవారంగంలోనైనా, ఇలా యే రంగంలోనైనా గణాంకాలు అవసరం. గణాంకాలు అవసరంలేని రంగం ఏదైనా ఉంది అంటే అది శాస్త్రమే కాదని చెప్పవచ్చు. ఈయన ప్రతిపాదించిన నమూనా అయిన ఉత్పత్తి వస్తువుల ఉత్పత్తి రంగం (కె - సెక్టార్) మరియు వినియోగ వస్తువుల ఉత్పత్తి రంగం (సి-సెక్టార్) ల ఆధారంగా రెండవ పంచవర్ష ప్రణాళికలో దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన రూర్కెలా, దుర్గపూర్ , భిలాయ ఇనుము ఉక్కు పరిశ్రమలను భారత ప్రభుత్వం స్థాపించింది. ఈయన అప్పటి బెంగాల్ ప్రెసిడెన్సీ బిక్రంపూర్లో జన్మించారు.

కలకత్తా విశ్వవిద్యాలయంలో ప్రముఖ శాస్త్రవేత్తలు జగదీష్ చంద్రబోస్, ప్రఫుల్ చంద్ర రాయ్ వంటి వారు ఇతనికి గురువులు. 1912 లో భౌతిశాస్త్రంలో పట్టా పొందారు. అనంతరం లండన్‌లో కేంబ్రిడ్జ్ కింగ్స్ కళాశాలలో ఉన్నత విద్యలు అభ్యసించారు. అక్కడే ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్‌ని కలుసుకున్నారు. అక్కడ నుండి భారత దేశానికి తిరిగి వచ్చి 1932 లో ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్‌ని స్థాపించారు. 1950 లలోనే మొదటి డిజిటల్ కంప్యూటర్ తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారు. దీన్నిబట్టి చూస్తే ఆయన గణాంక రంగంలో ఎంత ముందుచూపుఉందో ఇట్టే తెలుసుకోవచ్చు. గణాంక రంగంలో ఆయన ఎన్నో పరిశోధనలు చేశారు. అందుకే ఆయనను భారతీయ గణాంక పితామహుడని పిలుస్తారు. భారతీయ గణాంక సంస్థకు కార్యదర్శిగా, భారత ప్రభుత్వ కేబినెట్‌కి గణాంక సలహాదారుడుగా పనిచేశారు. భారత ప్రభుత్వం ఆయన చేసిన సేవలకు గాను పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందజేసింది.

జనక మోహన రావు దుంగ
ఫోన్: 8247045230

అబద్ధాలు, విభజన మోదీ ప్రాధాన్యత

- డాక్టర్ జ్ఞాన్‌పాఠక్

అబద్ధాలు చెప్పడం, ప్రజల మధ్య చీలికలు సృష్టించడం ప్రధాని మోదీకి అత్యంత ప్రధానమైన అంశాలు. ఎన్నికలు సమీపించేకొద్దీ వాగ్దానాలు, శంకుస్థాపనలు మితిమీరిపోయాయి. ప్రతిపక్షాలు ఉచిత పథకాలు ప్రకటిస్తున్నారని మాట్లాడే మోదీ, బీజేపీ రాష్ట్రాల్లో మాత్రం ఎన్ని పథకాలనైనా ప్రకటిస్తారు. అబద్ధాలు చెప్పడంలో ఆయనదే పైచేయి. అలాగే, మతాల ఆధారంగా ప్రజల మధ్యచీలికలు సృష్టించడంలోనూ మోదీ తర్వాతనే ఎవరైనా. రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకేమీ చేయకుండా ఐదేళ్లు వృధా చేసిందని మాట్లాడిన మోదీ తన పాలనలో రాష్ట్రాలకు చేసిందేమిటో చెప్పడానికేమీలేదు. కర్నాటక 40శాతం కమిషన్ రాష్ట్రమని అవినీతిలో ముందున్నప్పటికీ ప్రతిపక్షపాలిత రాష్ట్రాలు అవినీతికి చిహ్నామని ఆరోపణలు చేస్తుంటారు. రాజస్థాన్‌లో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధిక స్థానాలను గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. అసెంబ్లీ తరువాత ఒక ఏడాదికి (2019)లో లోకసభకు జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 25స్థానాలు బీజేపీకి దక్కాయి. అయితే 25మంది ఎంపీలు ఉన్నప్పటికీ రాష్ట్రానికి పెద్దగా మేలుచేసిందేమీలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఎన్నికల ప్రచారసభల్లో విమర్శించారు.

25మంది ఎంపీలకు ఆయా నియోజకవర్గాల అభివృద్ధి కోసం ఒక్కొక్కరికి 17కోట్లు కేంద్రం కేటాయించవలసి ఉండగా మోదీ ప్రభుత్వం 5నుంచి 12 కోట్లవరకు మాత్రమే కేటాయించింది. దీనితో రాష్ట్రానికి నీళ్లు, నిధులు దక్కలేదు. ఎంపీలు అందరికీ కలిసి 425కోట్లు కేటాయించి ఖర్చు చేయవలసిఉంది. అయితే కేవలం 187.5 కోట్లు మాత్రమే కేంద్రం కేటాయించింది. ఎంపీ లార్డ్స్ పథకం కింద ఈ నిధులను అందించింది. కేంద్రం చేసిన పని నాసిరకంగా ఉన్నప్పటికీ రాష్ట్రానికి తామే అన్నీ సమకూర్చామని వేలాదికోట్ల రూపాయల వ్యయంతో అనేక ప్రాజెక్టులను చేపట్టామని మోదీ వచ్చి అబద్ధాలు చెప్పారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఉన్నప్పటికీ రాజస్థాన్ నుండి ఎన్నికైన 25మంది ఎంపీలు తగినన్ని నిధులను తీసుకురావడంలోనూ రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన కార్యకలాపాలను చేపట్టడంలోనూ పూర్తిగా విఫలమయ్యారు. 2019లో జరిగిన లోకసభ ఎన్నికలకు ముందు జరిగిన ప్రచారంలో ఎన్నో వాగ్దానాలను చేసిన మోదీ వాటన్నింటినీ ఉల్లంఘించారు. ఎంపీ లార్డ్స్ పథకం కింద ఎన్నికైన ఎంపీలు ఆయారాష్ట్రాల అభివృద్ధిపనులకు కేంద్రానికి సిఫారసు చేస్తారు. అయితే రాష్ట్రాలకు ఆ నిధులను కేటాయించడం, ఖర్చుచేయడం అనేది కేంద్రప్రభుత్వం చేతుల్లోనే ఉంటుంది. రాజస్థాన్‌కు తగినన్ని నిధులు ఇవ్వకుండా పీఎం కేర్స్ నినాదం బూటకపు నినాదమని తేలిపోయింది. పీఎం లార్డ్స్ పథకాన్ని అమలుచేయని మోదీ ఆ రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపట్ల నిర్లక్ష్యం వహించిన మోదీ, సరిగా నిధులు ఇవ్వలేదని ఎంపీ లార్డ్స్ పథకాన్నిచూస్తే అర్థమవుతుంది. అదే సమయంలో రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ప్రజలందరికీ ఉచిత వైద్యం పథకాన్ని అలాగే వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజాదరణ పొందారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 100సీట్లు గెలుచుకోగా, బీజేపీ 73సీట్లలో విజయం పొందారు. ఆ తరువాత బీజేపీ నుండి 3ఎంఎల్‌ఏలు బైటకు వెళ్లిపోయారు. దీనితో బీజేపీకి 70సీట్లు మిగిలాయి. కాంగ్రెస్ తన బలాన్ని 108 సీట్లకు

పెంచుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పనులవల్లే బలం పెరిగిందని భావిస్తున్నారు. రాష్ట్రంలో చేసినఅభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేస్తున్నది. ఇటీవల ఎన్నికల ప్రచారం చేసిన ఖర్గే రాష్ట్ర ప్రభుత్వం రెడ్‌డైరీని రాసిందని మోదీ చేస్తున్న ప్రచారం కేవలం బూటకమేనని అన్నారు. రెడ్‌డైరీలో ఆర్థిక అవకతవకలు ఉన్నాయని ప్రచారం మొదలుపెట్టారు. తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను బీజేపీ కాపి కొడుతున్నదని ఖర్గే అన్నారు. ప్రజలకిచ్చిన హామీలను బీజేపీ అమలు చేయలేదని కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలుచేసి చూపించాయని ఖర్గే అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లోనే కాకుండా, 2024 లోకసభ ఎన్నికల్లోనూ తాము అధికారంలోకి వస్తామని ఖర్గేచెప్పారు. తాము గెలిస్తే, ఉజ్వల పథకం కింద గ్యాస్ సిలిండర్లను కేంద్ర ప్రభుత్వమే రూ.600కు సరఫరా చేస్తుందని ప్రచారం చేస్తున్నారు. మోదీ అధికారంలోకి వచ్చేనాటికి గ్యాస్ సిలిండర్ రూ.414లు ఉండగా, ఇప్పుడు రూ.1100కు పైగా పెరిగింది. అయితే ఇటీవల ఎన్నికలు వస్తున్నాయనగా రూ.200లను తగ్గించింది. దసరా, దీపావళి పండుగలేకాక నవంబరులో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, గ్యాస్ సిలిండర్ ధర మరో రూ.100తగ్గించి ఓటర్లకు గాలం వేసేందుకు మోదీ ప్రయత్నించారు. రాజస్థాన్‌లో ప్రభుత్వం ఉచిత వైద్య హక్కును చట్టంగా తీసుకురాగా మోదీ మాత్రం పౌరుల ఆరోగ్యానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నదని చెబుతున్నారు. కొవిడ్-19 మహమ్మారి వేలాదిమంది ప్రాణాలను హరిస్తున్నప్పటికీ రోగ గ్రస్తులను పెద్దగా పట్టించుకోకుండా వదిలేసిన వ్యవహారాన్ని చూస్తుంటే మోదీ చెప్పే ఆరోగ్యప్రాధాన్యత ఎంత బూటకమో అర్థమవుతుంది. మోదీ చెప్పేవన్నీ అర్థనిజాలు, ప్రజల మధ్య చీలికలు తీసుకురావడం ఎక్కువగా కనిపిస్తాయి.

విశాలాంధ్ర

ఆకాశాన్నంటిన గోదుమ ధరలు

- 8 నెలల గరిష్టానికి చేరిక
- డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడమే కారణం: నిపుణులు

న్యూఢిల్లీ: దేశంలో గోదుమల ధరలు ఆకాశాన్నంటాయి. గడిచిన ఎనిమిది నెలల కాలంలో ఎన్నడూ లేనంతగా ప్రస్తుతం గోదుమల ధరలున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 10 తర్వాత గోధుమల ధరలు ఇంత భారీగా పెరగడం ఇదే తొలిసారి. దానితో గోదుమలను కొనలేక సామాన్యుడు సతమతమవుతున్నాడు. అర్థాకలితో గడుపుతున్నాడు. ప్రస్తుతం పండుగల సీజన్ ప్రారంభంకావడంతో ధరలు చుక్కలనంటుతున్న గోదుమలు కొనలేక సామాన్య ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగావుంది.

పండుగల కారణంగా గోధుమలకు డిమాండ్ పెరిగిందనీ, అందుకు అనుగుణంగా సరఫరాలేదని ఆర్థిక నిపుణులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం ఇబ్బడిముబ్బడిగా పెంచడం కూడా గోదుమల ధరలు పెరుగుదలకు ప్రధాన కారణమని ఆర్థిక నిపుణులు చెప్పారు. దేశ రాజధాని దిల్లీలో గోధుమల ధర 1.6 శాతం పెరిగింది. దాంతో ఒక మెట్రిక్ టన్ను గోధుమల రేటు దిల్లీలో రూ.27,390కి చేరుకుంది. గత ఎనిమిది నెలల్లో గోధుమలకు ఇంత ధర ఎన్నడూ లేదని రిటైల్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇప్పట్లో గోధుమల ధరలు తగ్గే సూచనలు లేవని కేంద్రం సంకేతాలిచ్చింది. గోధుమల దిగుమతిపై 40 శాతంగా ఉన్న సుంకాన్ని ఇప్పటికిప్పుడు తగ్గించే ఆలోచనేదీ లేదని గత నెలలో పేర్కొన్నది.

బాస్మతీయేతర బియ్యం ఎగుమతిపై కేంద్రం కీలక నిర్ణయం

బియ్యం ఎగుమతుల విషయంలో కేంద్రం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. బాస్మతీయేతర తెల్ల బియ్యాన్ని మరో ఏడు దేశాలకు ఎగుమతి చేసేందుకు అనుమతించింది. దేశంలో బాస్మతియేతర తెల్ల బియ్యం కొరతను నివారించేందుకు, ఆ బియ్యం ధరలను అదుపు చేసేందుకు కేంద్రం గత ఏడాది జులైలో వాటి ఎగుమతులపై నిషేధం విధించిన విషయం పాఠకులకు విధితమే. నేపాల్, మలేసియా, ఫిలిప్పీన్స్, సీషెల్స్, కామెరూన్, ఐవొరీ కోస్ట్, రిపబ్లిక్ ఆఫ్ గినియా దేశాలకు బాస్మతీయేతర బియ్యాన్ని వివిధ పరిణామాలతో ఎగుమతి చేయడానికి తాజాగా కేంద్రం అనుమతించింది.నేషనల్ కోపరేటివ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్, ది డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్‌ల ద్వారా మాత్రమే బియ్యం ఎగుమతులకు అనుమతిస్తూ కేంద్రం బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏడు దేశాలకు 10,34,800 టన్నుల బాస్మతియేతర రకం తెల్ల బియ్యాన్ని ఎగుమతి చేసేందుకు కేంద్రం సమ్మతించింది.

నేపాల్‌కు 95,000 టన్నులు, కామెరూన్‌కు 1,90,000 టన్నులు, ఐవొరీ కోస్ట్‌కు 1,42,000 టన్నులు, రిపబ్లిక్ ఆఫ్ గినియాకు 1,42,000 టన్నులు, మలేసియాకు 1,70,000 టన్నులు, ఫిలిప్పీన్స్‌కు 2,95,000 టన్నులు, సీషెల్స్‌కు 800 టన్నుల తెల్లబియ్యం ఎగుమతులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంతకుముందు యూఏఈ, సింగపూర్‌కు కూడా బాస్మతీయేతర తెల్లబియ్యం ఎగుమతి చేసేందుకు భారత్ అనుమతించిన విషయం తెలిసిందే.

గాజాలో యుద్ధానికి ముగింపు పలకాలి: స్టాలిన్

చెన్నై: గాజాలో యుద్ధం భయంకరమైనదని... దీనిని ముగించేందుకు ఐక్యరాజ్యసమితి, ఇతర అన్ని దేశాలు కృషి చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బుధవారం అన్నారు. గాజాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వందలాది మంది ప్రాణాలను బలిగొన్న ఘోరమైన పేలుడు ఘటనను ఆయన ప్రస్తావిస్తూ... ఈ భయంకరమైన దాడికి పాల్పడినవారు మానవత్వాన్ని మరిచారా అని స్టాలిన్ ప్రశ్నించారు. యుద్ధాల్లో ఆసుపత్రులపై దాడి చేయకూడదని, ఈ భయంకర దాడిని ప్రపంచ దేశాలు చూస్తూ ఊరుకోరాదని స్టాలిన్ పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి, ప్రపంచంలోని అన్ని దేశాలు ఏకతాటిపైకి వచ్చి యుద్ధాన్ని ఆపాలని, అమాయకుల ప్రాణాలను రక్షించాలని అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. లక్ష్యంతో సంబంధం లేకుండా యుద్ధం అనేది భయంకరమైనదని...అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత 10 రోజులుగా గాజా ప్రాంతంలో జరుగుతున్న యుద్ధం ప్రపంచవ్యాప్తంగా ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆయన స్పష్టం చేశారు.

'యూజీసీ ఫెలోషిప్' ఆర్థిక సాయం పెంపు

న్యూఢిల్లీ: విద్యార్థులకు యూజీసీ ఫెలోషిప్‌ల కింద ఇచ్చే ఆర్థిక సాయాన్ని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) పెంచింది. ఇప్పటివరకు జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ కింద నెలకు రూ.31 వేల చొప్పున రెండేళ్లపాటు చెల్లించేవారు. దాన్ని ఇప్పుడు రూ.37 వేలకు పెంచారు. సీనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ కింద రూ.35 వేలకు బదులు రూ.42 వేలు ఇవ్వనున్నారు. సావిత్రిబాయి జ్యోతిరావు పూలే ఫెలోషిప్ ఫర్ సింగిల్ గర్ల్ చైల్డ్‌కు కూడా ఈ ఫెలోషిప్ పెంపు వర్తించనుంది. డీఎస్ కొఠారి పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ కోసం మూడేళ్లపాటు రూ.47 వేల నుంచి రూ.54 వేల వరకు ఇస్తుండగా.. దాన్ని రూ.58 వేల నుంచి రూ.67 వేలకు పెంచారు. ఈ మొత్తం పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ చేసే మహిళలతో పాటు ఎస్సీ, ఎస్టీలకు కూడా వర్తిస్తుంది. 2023 జనవరి 1 నుంచి ఈ పెంపు వర్తిస్తుందని యూజీసీ పేర్కొంది.

ఎన్డీయేతో చేతులు కలిపే ప్రశ్నేలేదు

జేడీఎస్ కర్నాటక అధ్యక్షుడు ఇబ్రహీం

బెంగళూరు: బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేలో ఎట్టిపరిస్థితిలోనూ చేరబోమని, జేడీఎస్ లౌకిక సిద్ధాంతాలకే కట్టుబడి ఉంటామని ఆ పార్టీ కర్నాటక రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సీఎం ఇబ్రహీం ప్రకటించారు. బెంగళూరులో పార్టీ మైనార్టీ నేతలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై తాజా పరిణామాల గురించి చర్చించారు. బీజేపీతో పొత్తు అంశాన్ని మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి దిల్లీలో ఏకపక్షంగా ప్రకటించారని, దీనికి తాము సమ్మతించబోమని ఇబ్రహీం అనంతరం మీడియాకు తెలిపారు. జేడీఎస్ తమిళనాడు, బీహార్, ఒడిశా రాష్ట్ర శాఖలు కూడా బీజేపీతో పొత్తును తీవ్రంగా వ్యతిరేకించిన సంగతిని ఆయన గుర్తుచేశారు. ఇక మిగిలిన కర్నాటక శాఖలో కూడా ఈ అంశంపై తీవ్రస్థాయిలో భిన్నాభిప్రాయాలున్నాయని ఇబ్రహీం పేర్కొన్నారు. జేడీఎస్‌కు చెందిన 17 మంది ఎమ్మెల్యేలతోనూ తాను ఇదే అంశంపై చర్చించానని, వీరిలో అత్యధికులు బీజేపీతో పొత్తును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. మాజీ ప్రధాని, పార్టీ జాతీయ అధ్యక్షుడు హెచ్‌డీ దేవెగౌడ అనారోగ్యాన్ని ఆసరాగా తీసుకునికుమారస్వామి తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు.

ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీజేపీ కుట్ర

కర్నాటక ఉప ముఖ్యమంత్రి శివకుమార్

బెంగళూరు: కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీజేపీలో ఓ బృందం క్రియాశీలకంగా వ్యవహరిస్తోందని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మీడియా ప్రతినిధులకు తెలిపారు. తమను ఎవరు సంప్రదిస్తున్నారో, తమకు ఎలాంటి ఆఫర్ ఇస్తున్నారో తనకు, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తెలియజేస్తున్నారన్నారు. దీనిపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో వివరాలు వెల్లడిస్తానని శివకుమార్ చెప్పారు. "అవును, దాని గురించి మాకు తెలుసు. ఎమ్మెల్యేలంతా ఎవరిని కలుస్తున్నారో నాకు, ముఖ్యమంత్రికి పూర్తిగా తెలియజేస్తున్నారు. వారిని ఏ విధంగా ప్రలోభ పెట్టాలని చూస్తున్నారో వారు మాకు చెబుతున్నారు" అని ఓ ప్రశ్నకు సమాధానంగా రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు కూడా అయిన శివకుమార్ తెలిపారు. 'మా వద్ద ప్రతిదానిపై సమాచారం ఉంది... ఇప్పుడు కాదు, అసెంబ్లీ (సెషన్) జరిగినప్పుడు, బీజేపీ నాయకులు సంప్రదించిన వారిని (శాసనసభ్యులు) మాట్లాడేలా చేస్తాం' అన్నారాయన. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి సింగపూర్‌లో కుట్ర జరుగుతోందని శివకుమార్ గతంలో కూడా పేర్కొన్నారు.

ప్రముఖ మలయాళ నటుడు కుందర జాని మృతి



కొల్లాం: మలయాళ చిత్ర పరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ నటుడు కుందర జానీ (71) మంగళవారం కన్నుమూశారు. మంగళవారం సాయంత్రం సమయంలో ఆయనకి హఠాత్తుగా ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు కొల్లాంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గుండెపోటుతో జానీ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల మలయాళ సినీ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. తమిళ, తెలుగు పరిశ్రమ సినీ ప్రముఖులు కూడా జానీ మృతికి సంతాపం తెలుపుతున్నారు. " కుందర జానీ నా చిరకాల మిత్రుడు. ఆయన మలయాళ చిత్రసీమలో 45 ఏళ్లకు పైగా చురుకుగా ఉన్నారు. దాదాపు 500 చిత్రాలకు పైగా నటించారు. కొల్లంలోని సాంస్కృతిక, సామాజిక వేదికల్లో నిరంతరం చురుకుగా ఉండే కుందర జానీ మృతికి నా సంతాపం తెలియజేస్తున్నా." అని సామాజిక మాధ్యమాలలో కెఎన్ బాలగోపాల్ పోస్ట్ చేశారు.

వందకి పైగా చిత్రాల్లో నటించిన జానీ 1979లో 'నిత్యవసంతం'తో సినీ పరిశ్రమలో అడుగుపెట్టారు. 'అగ్నిపర్వతం', 'రాజావింటే మకన్', 'ఆవనాజి', 'నాడోడిక్కట్టు' చిత్రాల్లో పోషించిన పాత్రలు జానీకి మంచి గుర్తింపు తెచ్చాయి. 'ఒరు సీబీఐ డైరీ కురిప్పు', 'కిరీడం', 'చెంకోల్', 'స్ఫదికం' తదితర చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. జానీ తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితమే. 2010వ సంవత్సరంలో విలక్షణ నటుడు కమల్ హాసన్ నటించిన 'రౌడీయిజం నశించాలి' సినిమాలో నటించారు. ఇక ఉన్ని ముకుందన్ ప్రధాన పాత్రలో వచ్చిన మెప్పడియాన్ (2022) చిత్రంలో ఆయన చివరిసారిగా తెరపై కనిపించారు. మలయాళంతో పాటు కొన్ని తమిళం, తెలుగు, కన్నడ చిత్రాలలో కూడా నటించారు. కథయిలే రాజకుమారి, నిలవుం నక్షత్రాలుమ్, సీబీఐ డైరీ అనే మలయాళ సీరియల్స్‌లో కూడా కనిపించారు.

చత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్‌కు చిక్కులు

టికెట్ దక్కని ఎమ్మెల్యే తిరుగుబాటు

కాంకెర్: చత్తీస్‌గఢ్‌లో అధికార కాంగ్రెస్ పార్టీ రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు 30మందితో తొలి జాబితా విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇందులో ఎనిమిదిమంది సిట్టింగ్ అభ్యర్థులకు పార్టీ టికెట్ నిరాకరించింది. ఈ క్రమంలో టికెట్ ఆశించి భంగపడ్డ అంతగఢ్ ఎమ్మెల్యే అనూప్ నాగ్ తాను స్వతంత్రంగా పోటీచేస్తానని బుధవారం ప్రకటించారు. నాగ్ 2018 ఎన్నికల్లో బీజేపీకి చెందిన విక్రమ్ ఉసెండిపై 13,414 ఓట్ల మెజారిటీతో షెడ్యూల్డ్ తెగల వర్గానికి రిజర్వు చేయబడిన అంతగఢ్ నుండి గెలుపొందారు. కాంగ్రెస్ ఈసారి ఈ స్థానం నుంచి రూప్ సింగ్ పొటైని బరిలోకి దించగా... బీజేపీ మరోసారి రాష్ట్ర మాజీ మంత్రి, మాజీ ఎంపీ ఉసెండీని మళ్లీ బరిలో దించింది. నామినేషన్ ఫారం కొనుగోలు చేసిన అనంతరం నాగ్ విలేకరులతో మాట్లాడుతూ... నామినేషన్ల దాఖలుకు చివరి రోజైన అక్టోబర్ 20న స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ సమర్పిస్తానని తెలిపారు. చత్తీస్‌గఢ్‌లో నవంబర్ 7న మొదటి దశ ఓటింగ్ జరగనున్న 20 స్థానాల్లో అంతగఢ్ కూడా ఉంది. రాష్ట్రంలోని మిగిలిన 70 స్థానాలకు నవంబర్ 17న రెండో దశలో పోలింగ్ జరగనుంది. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. తనకు టికెట్ రాకపోవడంతో తన నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని ఎమ్మెల్యే నాగ్ పేర్కొన్నారు. "గత ఐదు సంవత్సరాలుగా, కోవిడ్-19 మహమ్మారి సమయంలో కూడా నేను ఈ ప్రాంతంలో ప్రజల కోసం పనిచేశాను. అయినప్పటికీ టికెట్ ఇవ్వరాదని నిర్ణయం తీసుకున్నారు. ప్రజలకు సేవ చేసేందుకు పార్టీ నుంచి మరో అవకాశం వస్తుందని ఆశించాను కానీ అది జరగలేదు" అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ టికెట్ ఇచ్చిన రూప్‌సింగ్ పొటైపై కూడా నాగ్ విరుచుకుపడ్డారు. బీజేపీలో క్రియాశీల సభ్యునిగా ఉండి, గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరిన వ్యక్తిని పార్టీ రంగంలోకి దింపిందన్నారు. రాజస్థాన్‌లో జరిగిన 'సంకల్ప్ శివిర్'లో ఇతర పార్టీలను విడిచిపెట్టి పార్టీలో చేరిన వారికి టికెట్ ఇవ్వరాదని కాంగ్రెస్ నిర్ణయించినప్పటికీ అంతగఢ్‌లో మాత్రం అది పాటించలేదని నాగ్ అన్నారు. కాగా రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్‌కు 140 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాంకేర్‌ను బుధవారం ముఖ్యమంత్రి భూపేశ్ బఘెల్ సందర్శించారు. కాంకేర్, భానుప్రతాపూర్ , అంతగఢ్ స్థానాల నుండి కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 2018 ఎన్నికల్లో 90 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ 68 స్థానాలు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీజేపీ బలం 15 స్థానాలకు తగ్గగా... జేసీసీ (జే), బీఎస్పీ వరుసగా 5, 2 స్థానాలను కైవసం చేసుకున్నాయి. ప్రస్తుత సభలో కాంగ్రెస్ బలం 71.

ఎంపీ, రాజస్థాన్ అభ్యర్థుల ఖరారుపై

కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేయడంపై కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. ఈ విషయమై పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నేతృత్వంలో పార్టీ నాయకత్వం రెండు రాష్ట్రాలకు సంబంధించి వేర్వేరు సమావేశాలు నిర్వహించింది. రాజస్థాన్‌కు సంబంధించిన సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొనగా... ఆయన తెలంగాణ పర్యటనకు వెళ్లాల్సి రావడంతో మధ్యప్రదేశ్‌కు సంబంధించిన సమావేశంలో పాల్గొనలేదు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ... రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తపర్చారు. రాజస్థాన్‌లో గత ఐదేళ్లలో సుపరిపాలన అందించామని... అక్కడ మళ్లీ పార్టీ విజయం సాధించడం ఖాయమని చెప్పారు.

రాజస్థాన్‌లో నవంబర్ 25న జరగనున్న ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేయడానికి ఏఐసీసీ చీఫ్ ఖర్గే అధ్యక్షతన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశం నిర్వహించింది. కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సుఖ్‌జీందర్ రాంధావా, రాజస్థాన్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ గోవింద్ దోతస్రా, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాజస్థాన్ స్క్రీనింగ్ కమిటీ చీఫ్ గౌరవ్ గొగోయ్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. మధ్యప్రదేశ్ సీఈసీ సమావేశానికి రాష్ట్ర పార్టీ చీఫ్ కమల్ నాథ్, ఏఐసీసీ ఇన్‌చార్జ్ రణదీప్ సూర్జేవాలా హాజరయ్యారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో అన్ని స్థానాల్లో అభ్యర్థుల ఖరారుపై స్క్రీనింగ్ కమిటీ చర్చలు జరిపిందని ఖర్గే తెలిపారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీకి నవంబర్ 17న, రాజస్థాన్ ఎన్నికలు నవంబర్ 25న జరగనున్నాయి.

భార్య, కుమారుడు సహా ఎస్పీ నేత ఆజాంఖాన్‌కు ఏడేళ్ల జైలు

నకిలీ జనన ధృవీకరణ పత్రాల కేసులో దోషులుగా నిర్ధారణ

రాంపూర్: సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నాయకుడు ఆజాం ఖాన్, ఆయన భార్య తజీన్ ఫాతిమా, కుమారుడు అబ్దుల్లా ఆజాంలకు యూపీలోని రాంపూర్ కోర్టు ఏడేళ్ల జైలు శిక్షను విధించింది. 2019 నాటి నకిలీ జనన ధృవీకరణ పత్రాల కేసులో ఈ ముగ్గుర్ని దోషులుగా నిర్ధారించింది. ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు న్యాయమూర్తి షోబిత్ బన్సల్ ముగ్గురు దోషులకు గరిష్టంగా ఏడేళ్ల జైలు విధిస్తూ శిక్షను ఖరారు చేశారు. నకిలీ ధ్రువపత్రాలపై బీజేపీ ఎమ్మెల్యే ఆకాశ్ సక్సేనా రాంపూర్‌లోని గంజ్ పోలీస్ స్టేషన్‌లో జనవరి 3, 2019న పోలీసులకు ఫిర్యాదు చేయగా... ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆజాం కుమారుడు అబ్దుల్లా ఆజాంకు రెండు నకిలీ పుట్టిన తేదీ సర్టిఫికేట్‌లు పొందేందుకు ఆజాం ఖాన్, ఆయన భార్య తజీన్ ఫాతిమా సహాయం చేశారని సక్సేనా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక సర్టిఫికెట్ లక్నో నుంచి కాగా మరొకటి రాంపూర్ నుంచి పొందినట్లు ఫిర్యాదులో స్పష్టం చేశారు. "కోర్టు తీర్పు తర్వాత, ముగ్గురిని జ్యుడీషియల్ కస్టడీలోకి తీసుకున్నారు. కోర్టు నుండే దోషులను జైలుకు తరలించారు" అని ప్రాసిక్యూషన్ తరపున వాదిస్తున్న మాజీ జిల్లా ప్రభుత్వ న్యాయవాది అరుణ్ ప్రకాష్ సక్సేనా వెల్లడించారు. చార్జిషీటు ప్రకారం అబ్దుల్లా ఆజాం జనవరి 1,1993న జన్మించినట్లు రాంపూర్ మున్సిపాలిటీ నుంచి ఒక ధ్రువపత్రాన్ని పొందగా.. మరొకటి సెప్టెంబర్ 30, 1990న జన్మించినట్లు లక్నో నుంచి పొందారు. నాలుగేళ్లపాటు విచారణ తర్వాత న్యాయస్థానం ఈ మేరకు శిక్షను ఖరారు చేసింది. దాదాపు 15ఏళ్ల నాటి కేసులో దోషిగా నిర్ధారణ కావడంతో రెండేళ్ల జైలు శిక్ష అనుభవించిన తర్వాత ఈ ఏడాది మొదట్లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ సభ్యత్వాన్ని కోల్పోయిన అబ్దుల్లాకు తాజాగా మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో అబ్దుల్లాకు విధించిన శిక్షపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు గతవారం నిరాకరించింది.

ప్రచారం కోసం సైన్యాన్నీ వదలని మోదీ

- దేశవ్యాప్తంగా 822 సెల్ఫీ పాయింట్ల ఏర్పాటు
- వీటి ద్వారా కేంద్ర సంక్షేమ పథకాల ప్రచారం
- సైన్యానికి మోదీ సర్కారు ఆదేశాలు

న్యూఢిల్లీ: ప్రతి విషయానికి విస్తృత ప్రచారానికి అలవాటుపడిన కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు ఈ విషయంలో సైన్యాన్ని కూడా వదిలిపెట్టట్లేదు. దేశవ్యాప్తంగా సెల్ఫీ పాయింట్లు ఏర్పాటుచేసి, వాటి ద్వారా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలని సైన్యానికి ఎన్డీయే సర్కారు ఆదేశాలు జారీచేయడం వివాదాస్పదంగా మారింది. తొమ్మిది నగరాల్లో ఈ సెల్ఫీ పాయింట్లను ఏర్పాటుచేయనున్నట్టు రక్షణ శాఖ తెలిపింది. డీఆర్‌డీవో, బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ సైతం ఇందులో భాగస్వామ్యం కానున్నట్టు ఈ అంశంతో సంబంధమున్న కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

ప్రధాని మోదీ ఫొటోతో పాటు, ఉజ్వల్ యోజన, ఆత్మనిర్భర్ భారత్ మొదలైన కేంద్ర పథకాల్ని ప్రజలకు తెలియజేసేలా ఈ సెల్ఫీ పాయింట్లను కేంద్రం ఏర్పాటు చేస్తున్నది. ఇందులో రక్షణ శాఖ 822 సెల్ఫీ పాయింట్లను తీసుకురానున్నది. వీటిలో సైన్యం- 100, ఎయిర్‌ఫోర్స్-75, నేవీ-75, డీఆర్‌డీవో-50, బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్-50, సైనిక్‌స్కూల్-50, మిగతా రక్షణ విభాగాలు 422 సెల్ఫీ పాయింట్లను ఏర్పాటుచేస్తాయని కేంద్రం తెలిపింది.

ప్రచారానికి సైన్యాన్ని వినియోగించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిపక్షాలు ఖండించాయి. దేశానికి రక్షణ కల్పించే సైనికుల ధైర్యసాహసాలను, పేరు ప్రఖ్యాతలను ప్రధాని మోదీ తన రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. గత 75 ఏళ్లలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదన్నారు.

టీవీ జర్నలిస్టు హత్యకేసులో

ఎట్టకేలకు న్యాయం

ఫోరెన్సిక్ రిపోర్టులో సంచలన నిజాలు

15 ఏళ్ల తర్వాత వెలువడిన తీర్పు

న్యూఢిల్లీ: యువ మహిళా టీవీ జర్నలిస్టు సౌమ్య విశ్వనాథన్ హత్యకేసులో ఎట్టకేలకు న్యాయం జరిగింది. సంచలనం రేపిన ఈ కేసులో ఐదుగురు నిందితులను కోర్టు దోషులుగా నిర్ధారించింది. రవికపూర్, అమిత్ శుక్లా, అజయ్ కుమార్, బల్జీత్ మాలిక్, అజయ్ సేథీలను సాకేత్ కోర్టు దోషులుగా బుధవారం తేల్చి చెప్పింది. దాదాపు పదిహేనేళ్ల తర్వాత ఈ కేసులో న్యాయం లభించింది. జర్నలిస్ట్ సౌమ్యా విశ్వనాథన్ 2008 సెప్టెంబరు 30న దిల్లీలో తన కారులో గాయాలతో శవమై కనిపించారు. ఇది తొలుత ప్రమాదం కేసుగా నమోదుచేశారు. కానీ తలపై తుపాకీతో కాల్చినట్లు ఫోరెన్సిక్ నివేదికలో బయటపడడంతో హత్య కేసుగా దర్యాప్తు ప్రారంభించారు. ఆ తరువాత సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు విచారణ చేపట్టారు. 2009 మార్చిలో నిందితులను పోలీసులు అదుపులోకి విచారించగా సౌమ్యాను తామే హత్య చేసినట్లు అంగీకరించారు. తుపాకితో కాల్చి ఆమెను అతి కిరాతకంగా హత్య చేసిన దుండుగులు మృతదేహాన్ని కారులో పడేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని పోలీసులు తేల్చారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న రవి కపూర్, అమిత్ శుక్లా, బల్జిత్ మాలిక్, అక్షయ్ కుమార్, అజయ్ సేథిని దోషులుగా తేల్చడంతోపాటు మహారాష్ట్ర వ్యవస్థీకృత నేరాల నియంత్రణ చట్టంలోని నిబంధనల ప్రకారం దోపిడి కేసులోనూ దోషులుగా పేర్కొంది. వీరిలో రవి కపూర్, అమిత్ శుక్లా, బల్జిత్ మాలిక్, అక్షయ్‌లను హత్య, దోపిడీ కేసులో దోషులుగా నిర్ధారించిన కోర్టు వీరికి సహకరించినందుకు ఐదో నిందితుడు అజయ్‌ను కూడా దోషిగా ప్రకటించింది. పదిహేనేళ్ల సుదీర్ఘ విచారణను అక్టోబరు 13న పూర్తిచేసిన సాకేత్ కోర్టు అడిషినల్ సెషన్స్ జడ్జి రవీంద్ర కుమార్ పాండే తీర్పు రిజర్వ్‌లో ఉంచి నేడు వెలువరించారు.

కోర్టు తీర్పుపై సౌమ్యా విశ్వనాథన్ తల్లి మాధవి విశ్వనాథన్ భావోద్వేగానికి లోనయ్యారు. తన కూతురు ఎలాగూ చనిపోయింది.. ఆమె తిరిగి రాదు కానీ ఈ తీర్పు నేరస్థుల్లో భయాన్ని రేపుతుంది. లేదంటే వాళ్ల మరింత రెచ్చిపోతారని ఆమె వ్యాఖ్యానించారు. ఈ కేసును విచారించిన పోలీసు అధికారిని హత్తుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు. కనీసం వారికి జీవిత ఖైదు విధించాలని కోరారు. ఇది ఇలా ఉంటే కాల్ సెంటర్ ఉద్యోగి జిగిషా ఘోష్ హత్యలో వీళ్లేనేరస్థులు కావడం గమనార్హం. జిగిషా హత్యలో ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకోవడంతోనే విశ్వనాథన్ హత్య కేసును కూడా ఛేదించినట్లు దిల్లీ పోలీసులు తెలిపారు. ఈ కేసులో రవి కపూర్, అమిత్ శుక్లాను తొలుత అరెస్టు చేశారు. అనంతర బల్జిత్ మాలిక్, అజయ్ సేథీని అరెస్టు చేయడంతో పాటు 2010 జూన్10న వారిపై ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. 2010 నవంబర్‌లో విచారణ ప్రారంభమై 2016 జులైలో ముగిసింది. కపూర్, శుక్లాలకు మరణశిక్ష, మాలిక్‌కు ట్రయల్ కోర్టు జీవిత ఖైదు విధించింది. అయితే, జనవరి 2018లో కపూర్, శుక్లాల మరణశిక్షను హైకోర్టు యావజ్జీవ కారాగార శిక్షగా మార్చింది. అయితే మాలిక్ జీవిత ఖైదును సమర్థించింది.

ఎన్‌సీఎల్ఏటీ సభ్యులకు

కోర్టు ధిక్కార నోటీసులు

న్యూఢిల్లీ: దేశసర్వోన్నత న్యాయస్థానంలో బుధవారం అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ)సభ్యులిద్దరికి కోర్టు ధిక్కారం కింద సుప్రీం కోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. నవంబర్ 30వ తేదీన వాళ్లిద్దరిని తమ ఎదుట హాజరు కావాలని సీజేఐ ధర్మాసనం ఆ నోటీసుల్లో ఆదేశించింది. ఫినోలెక్స్ కేబుల్స్ వార్షిక సమావేశానికి సంబంధించిన వ్యవహారంలో అక్టోబర్ 13వ తేదీన యథాతథ స్థితి ఆదేశాలు ఇచ్చింది. అయితే ఆ ఆదేశాలతో సంబంధం లేకుండా ఎన్‌సీఎల్ఏటీ జ్యుడీషియల్ సభ్యుడు రాకేశ్ కుమార్, టెక్నికల్ మెంబర్ డాక్టర్ అలోక్ శ్రీవాస్తవ ఈ వ్యవహారంపై దాఖలైన అప్పీల్‌పై తీర్పు ఇచ్చారు. ఈ విషయాన్ని సంబంధిత లాయర్లు సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లగా న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. ఈ విషయంపై దర్యాప్తు జరపాలని ఎన్‌సీఎల్ఏటీ ఛైర్‌పర్సన్ జస్టిస్ అశోక్ భూషణ్‌ను సుప్రీం కోర్టు ఆదేశించింది. సుప్రీం కోర్టు స్టేటస్ కో ఆదేశాల గురించి తమకు తెలియదని ఆ ఇద్దరు సభ్యులు ఛైర్‌పర్సన్ ముందు వివరణ ఇచ్చారు. ఇదే విషయాన్ని దర్యాప్తు నివేదికలో ఛైర్‌పర్సన్ పొందుపరిచారు అయితే దర్యాప్తు నివేదిక బుధవారం సుప్రీం కోర్టుకు చేరింది. దానిని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం పరిశీలించింది. సుప్రీం కోర్టు ఆదేశాలు తెలిసి కూడా ఎన్‌సీఎల్ఏటీ తీర్పు వెల్లడించినట్లు ప్రాథమికంగా ధర్మాసనం గుర్తించింది. ఆ ఇద్దరు సభ్యులను అక్టోబర్ 30వ తేదీన తమ ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించింది.

ఇజ్రాయిల్‌ది యుద్ధ నేరం...

గాజాలో మారణహోమాన్ని తక్షణమే ఆపాలి: సీపీఐ

న్యూఢిల్లీ: గాజాలోని గాజాలోని ఆసుపత్రిపై దాడి, వందల మంది మరణించడంపై వామపక్ష పార్టీలు దిగ్భ్రాంతి వ్యక్తంచేశాయి. ఇది ముమ్మాటికి యుద్ధనేరం... మారణహోమం అని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సహా సీపీఎం, సీపీఐ (ఎంఎల్)-న్యూ డెమొక్రసీ వేర్వేరు ప్రకటనలు చేశాయి. ఇజ్రాయిల్ అదే పనిగా అంతర్జాతీయ నిబంధనలను, ఒప్పందాలను ఉల్లంఘిస్తోందని, ఆసుపత్రిలో మారణహోమం అసృష్టించడం అమానవీయమని సీపీఐ పేర్కొంది. దీనిని క్రూరమైన దాడిగా వర్ణించింది. ఈ విపత్తు సమయంలో పలస్తీనా ప్రజలకు వెన్నుదన్నుగా నిలవాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చింది. అమాయక పలస్తీనీయులపై అమానవీయ దాడులను నిలువరించేలా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవాలని కోరింది. పలస్తీనాకు అండగా నిలవాలని మోదీ ప్రభుత్వానికి సూచించింది. భారత్ అనవాయితీని కొనసాగించాలని హితవుపలికింది. పలస్తీనా విషయంలో భారత్ స్పష్టమైన వైఖరితో ఉండాలని పేర్కొంది. గాజా ఆసుపత్రిపై అమానవీయ దాడికి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసనలు తెలపాలని పార్టీ శ్రేణులకు, శ్రేయోభిలాషులకు, శాంతి కార్యకర్తలకు సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం పిలుపునిచ్చింది. గాజా ఆసుపత్రిలో అర్ధరాత్రి జరిపిన దాడిలో 500 మంది చనిపోవడం యుద్ధ నేరం కాక మరేమిటంటూ సీపీఎం ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ మారణహోమాన్ని తక్షణమే ఆపేయాలని డిమాండ్ చేసింది. తాజా ఘటనను యుద్ధ నేరంగా ప్రకటించేందుకు, దానిపై తగు చర్యలు తీసుకునే విధంగా ఒత్తిడి తేచ్చేందుకు అంతర్జాతీయ సమాజం మేల్కొవాలని పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. గాజా ఆసుపత్రిపై దాడికి వ్యతిరేకంగా ఈనెల 18-21 తేదీల్లో ఆందోళనలకు సీపీఐ (ఎంఎల్)-న్యూ డెమొక్రసీ పిలుపునిచ్చింది. ఈ దాడిని తీవ్రంగా ఖండించాలని భారత ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అమెరికా అధ్యక్షుడి ఇజ్రాయిల్ పర్యటనతో అగ్రరాజ్యానికి మానవహక్కులకు మద్దతు, మానవతా చట్టాల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో తేలిపోయిందని దుయ్యబట్టింది.

గాజాలో నిమిషానికో పసిప్రాణం గాల్లోకి...

జెరూసలేం: గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయిల్ భీకర దాడులు అక్టోబరు 7 నుంచి కొనసాగుతున్నాయి. 12 రోజుల యుద్ధం వల్ల గాజా ప్రజలు ముఖ్యంగా చిన్నారులపై ప్రభావం తీవ్రంగా ఉంటోంది. ఇప్పటివరకు వెయ్యి మందికిపైగా చిన్నారులను ఇజ్రాయిల్ సైన్యం చంపేసింది. ఈ లెక్కన నిమిషానికి ఒక పసి ప్రాణం గాల్లోకి కలిసిపోతోంది అని డిఫెన్స్ ఫర్ చిల్డ్రన్ ఇంటర్నేషనల్- పలస్తీనా (డీసీఐపీ) పేర్కొంది. గాజా జనాభా 23లక్షలలో సగానికిపైగా 18ఏళ్ల లోపు వారున్నట్లు తెలిపింది. హమాస్ అంతానికి సంకల్పించి, దానిపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఇజ్రాయిల్ తహతహలాడుతోంది. గాజాపై బాంబుల వర్షాన్ని కురిపిస్తోంది. ఇప్పటివరకు ఆరువేలకుపైగా బాంబులతో దాడిచేసింది. తాజా పరిణామాలపై డీసీఐపీ గాజా అధ్యయ నకర్త మహమ్మద్ అబూ రుఖ్‌బే ఓ నివేదిక ఇచ్చారు. అందులో పలస్తీనాలో పిల్లల దుస్థితిపై ఆందోళన వ్యక్తంచేశారు. శిధిలాల కింద చిక్కుకుపోయి అనేక మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. నిర్వాసిత ప్రాంతాలు పూర్తిగా ధ్వంసం కాగా తమ ఇళ్లన్నీ కూల్చేశార న్నారు. తాజా దాడులకు ముందే ఏడాదికిపైగా ఆంక్షల వలయంలో ఉన్నందున ప్రతి ఐదుగురు పిల్లల్లో నుంచి కనీసం నలుగురు తీవ్రమైన మానసిక కుంగుబాటుతో బాధపడుతున్నారని తెలిపారు. పిల్లలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారని, వారిలో భయోత్పాతం ఎక్కువగా ఉంటోందని వెల్లడించారు. ఎన్నడూ లేని విధంగా భయానక రీతిలో గాజాపై ఇజ్రాయిల్ దాడులు చేస్తోంది. ఆహారం, తాగునీరు కూడా నిలిపివేసింది. దీంతో పసివారి పరిస్థితి దీనంగా మారింది. ఇంధనం, విద్యుత్ సరఫరా కూడా లేదు. దయనీయ పరిస్థితుల్లో చాలా మంది గాజా ప్రజలు సముద్రపు నీటిని, మురికినీటిని తాగుతుండగా ఆసుపత్రుల్లోని సిబ్బంది సెలైన్ బ్యాగులను తాగుతూ ప్రాణాలు నిలుపుకుంటున్నారు. మంగళవారం ఖాన్ యూనిస్, రాఫా, డెయిర్ ఎల్ బల్హాలో ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడుల్లో 70 మందికిగాపై మరణించారు. ఆసుపత్రిపై జరిగిన దాడిలో 500 మంది చనిపోయారు. పౌరుల తీవ్ర వెతలు కనిపిస్తున్నా కాల్పుల విరమణకు ఇజ్రాయిల్ ససేమిరా అంటుండటం మానవసంఘాలను కలవరబెడుతోంది.

నెతన్యాహు చెప్పేవన్నీ అబద్ధాలే: రియాద్ మన్సూద్

జెరూసలేం: గాజాలోని ఆసుపత్రిపై దాడికి 'ఇస్లామిక్ జిహాద్'దే బాధ్యత అని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు అబద్ధాలు చెబుతున్నారని ఐరాసకు పలస్తీనా దౌత్యాధికారి రియాద్ మన్సూర్ ఆరోపించారు. 'అతను అబద్ధాలకోరు. ఆసుపత్రి సమీపంలో హమాస్ స్థావరం ఉందని భావించి ఇజ్రాయిల్ దాడి చేసినట్లు అతనికి డిజిటల్ అధికార ప్రతినిధి ట్వీట్ చేశారు. తర్వాత ఆ ట్వీట్‌ను తొలగించారు. మా వద్ద సంబంధిత ట్వీట్ ప్రతి ఉంది. మాట మార్చేసి పలస్తీనా ప్రజలపైనే నిందలు మోపుతున్నారు' అని మన్సూర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఆసుపత్రులను ఖాళీ చేయాలని ఇజ్రాయిల్ సైన్యం ప్రకటన చేసింది. అంటే ఆసుపత్రులపైనా దాడులు జరుగుతాయనే కదా! ఇప్పుడు అమాయకత్వం నటిస్తున్నారు. కథ మొత్తాన్ని అడ్డం తిప్పేశారు. తమ నేరానికి ఇతరులను బాధ్యులు చేయాలని చూస్తున్నారు. అలా జరగనివ్వం' అని మన్సూద్ తేల్చిచెప్పారు.

దేశవ్యాప్తంగా 16 మంది హైకోర్టు జడ్జిల బదిలీ

- ఏపీ, తెలంగాణ నుంచి ఇద్దరు
- కర్నాటక హైకోర్టు నుంచి ఏపీకి ఒకరు బదిలీ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 16 మంది హైకోర్టు జడ్జిలు బదిలీ అయ్యారు. గతంలో సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసిన పదహారు మంది హైకోర్టు న్యాయమూర్తుల బదిలీలను కేంద్ర ప్రభుత్వం బుధవారం నోటిఫై చేసింది. ఈ మేరకు భారత ప్రధాన న్యాయమూర్తి డీవీ చంద్రచూడ్‌తో సంప్రదింపులు జరిపిన తర్వాత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. బదిలీ అయిన జడ్జిల్లో ఏపీ హైకోర్టుకు చెందిన ఇద్దరు, తెలంగాణకు చెందిన ఇద్దరు న్యాయమూర్తులు కూడా ఉన్నారు.

అలహాబాద్ హైకోర్టు నుంచి జస్టిస్ ఎస్పీ కేసర్‌వాణి కలకత్తా హైకోర్టుకు బదిలీ. పంజాబ్-హర్యాణా హైకోర్టు నుంచి జస్టిస్ రాజ్ మోహన్ సింగ్ మధ్యప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. కర్నాటక హైకోర్టు నుంచి జస్టిస్ నరేందర్ జీ ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. పాట్నా హైకోర్టు నుంచి జస్టిస్ సుధీర్ సింగ్ పంజాబ్, హర్యానా కోర్టుకు, మణిపూర్ హైకోర్టు నుంచి. జస్టిస్ ఎంవీ మురళిధరన్ కలకత్తా హైకోర్టుకు, పాట్నా హైకోర్టు నుంచి జస్టిస్ మధురేశ్ ప్రసాద్ కలకత్తా హైకోర్టుకు బదిలీ అయ్యారు. పంజాబ్, హర్యానా హైకోర్టు నుంచి జస్టిస్ అరవింద్ సింగ్ సాంగ్వాన్ అలహాబాద్ హైకోర్టుకు, పంజాబ్, హర్యానా హైకోర్టు నుంచి జస్టిస్ అవనీశ్ జింగాన్, జస్టిస్ అరుణ్ మోంగా రాజస్థాన్ హైకోర్టుకు, అలహాబాద్ హైకోర్టు నుంచి జస్టిస్ రాజేంద్ర కుమార్ మధ్యప్రదేశ్ హైకోర్టుకు, గువాహతి హైకోర్టు నుంచి జస్టిస్ నాని టాగియా పాట్నా హైకోర్టుకు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నుంచి జస్టిస్ సి మానవేంద్రనాథ్ రాయ్ గుజరాత్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. తెలంగాణ హైకోర్టు నుంచి జస్టిస్ మున్నూరి లక్ష్మణ్ రాజస్థాన్ హైకోర్టుకు, జస్టిస్ జి అనుపమ చక్రవర్తి పాట్నా హైకోర్టుకు బదిలీ అయ్యారు. కలకత్తా హైకోర్టు నుంచి జస్టిస్ లపితా బెనర్జీ (అదనపు న్యాయమూర్తి) పంజాబ్, హర్యానా హైకోర్టుకు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నుంచి జస్టిస్ దుప్పల వెంకట రమణ (అదనపు న్యాయమూర్తి) మధ్యప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయ్యారు.

తెలంగాణలో కుటుంబ దోపిడీ

- కేసీఆర్ కమీషన్ల కోసమే ప్రాజెక్టులు
- బీజేపీ-బీఆర్ఎస్-ఎంఐఎం ఒక్కటయ్యాయి
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

విశాలాంధ్ర-హైదరాబాద్ /ములుగుజిల్లా బ్యూరో: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ఏకమై పనిచేస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకులు ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్‌ను తెలంగాణ ప్రజలు ఆదరించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బుధవారం ములుగులో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి కాంగ్రెస్ పార్టీ బస్సుయాత్రను రాహుల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి మాట్లాడుతూ... కర్నాటక, హిమాచల్ ప్రదేశ్ లో విజయం సాధించిన విధంగానే తెలంగాణతో పాటు ఎన్నికలు జరిగే మిగతా నాలుగు రాష్ట్రాల్లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ నేడు ఒక కుటుంబం చేతిలో బందీగా మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క కుటుంబం తెలంగాణ సంపదను దొంచుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. అనేక ఆకాంక్షలతో తెచ్చుకున్న రాష్ట్రంలో నేడు ఏ ఒక్క వర్గం ప్రజలు కూడా సంతోషంగా లేరన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి తన కమీషన్ల కోసం ప్రాజెక్టులు కట్టి భారీ అవినీతికి తెరలేపారన్నారు. దేశంలో అత్యంత అవినీతి ప్రభుత్వం ఏదైనా ఇందంటే అని బీఆర్ఎస్ సర్కార్ మాత్రమే అన్నారు. ఇంత జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం తమకేమీ తెలియదన్నట్టుగా నాటకం అడుతోందని మండిపడ్డారు. ప్రతిపక్షాల పై అన్ని రకాలుగా కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడే కేంద్రం బీఆర్ఎస్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. స్వయంగా ప్రధాన మంత్రితో పాటు కేంద్ర మంత్రులంతా బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ప్రకటనలు చేస్తారు కానీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటే ఈ రెండు పార్టీల మధ్య ఉన్న రహస్య ఒప్పందమే కారణమన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కేంద్రం దాడులు చేస్తుందని...ఈడీ, సీబీఐ, ఇన్‌కమ్ టాక్స్ ఇలా అన్ని శాఖలను ప్రయోగించి ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. తన పై కూడా ఇప్పటి వరకు 24 కేసులు పెట్టి, నా లోక్ సభ సభ్యత్వాని రద్దు చేయడంతో పాటు ఇంటిని కూడా లాకున్నారని మండిపడ్డారు. కానీ తెలంగాణలో ఇంత పెద్దఎత్తున అవినీతి జరుగుతున్నా కూడా కేంద్రం నుండి స్పందన లేకపోవడం వెనుక అంతర్యం ఏమిటన్నారు. కేంద్రానికి పార్లమెంట్‌లో అవసరమైన ప్రతిసారీ బీఆర్ఎస్ పక్ష ఎంపీలు బీజేపీ సర్కార్ కు మద్దతు ఇచ్చారని దానికి కృతజ్ఞతగానే కేంద్రం తెలంగాణ సర్కారు పై ఉదాసీన వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొట్టి లబ్ధిపొందాలని చూస్తోందని పేర్కొన్నారు. బీజేపీ ఏలుబడిలో దేశ ఆర్థికవ్యవస్థ పూర్తిగా కుప్ప కూలిందన్నారు. ఇద్దరు వ్యక్తుల కోసమే అధికారంలో ఉన్నట్లు మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని రాహుల్ విమర్శించారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయంలో ఆ ఇద్దరు వ్యక్తులకు లబ్ధిచేకూర్చేలా ఉంటాయని విమర్శించారు. వారు గత ఎన్నికల సమయంలో ప్రకటించిన ఏ ఒక్క హామీ కూడా నెరవేరలేదన్నారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చలేదన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ఇస్తామని కరీంనగర్ గడ్డపై ఇచ్చిన మాటను సోనియా గాంధీ నేరవేర్చారని, కానీ తెలంగాణలో ప్రజల ఆకాంక్షలు నెరవేరటం లేదన్నారు. అందుకే ఆరు గ్యారంటీలు అమలు చేసి తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని కాంగ్రెస్ నిర్ణయించుకుందని తెలిపారు.

కాంగ్రెస్‌లోకి మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రతాపసింగారంలోని సుధీర్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన్ను కలిసి కండువా కప్పి పార్టీలోకి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. సుధీర్ రెడ్డిగారు గొప్ప నిర్ణయం తీసుకున్నారు.. వారిని మనస్ఫూర్తిగా కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నా అన్నారు. నన్ను గల్లీ నుంచి ఢిల్లీకి పంపించడంలో ఈ నియోజకవర్గ ప్రజల శ్రమ ఉందని పేర్కొన్నారు. ఇక్కడి ప్రజలకు.. ఈ ప్రాంతానికి నేను ఎంతో రుణపడి ఉన్నా అన్నారు.

ఎన్నికల వరాలు!

- కేంద్ర ప్రభుత్వోద్యోగుల డీఏ పెంపు
- రైల్వే ఉద్యోగులకు 78 రోజుల వేతనం బోనస్
- ఆరు పంటలకు పెరిగిన ఎంఎస్పీ
- వరిని మర్చిన వైనం
- లధక్‌లో సోలార్ ప్రాజెక్టు
- ప్రజల్ని మెప్పించేలా కేబినెట్ నిర్ణయాలు

న్యూఢిల్లీ: దేశంలో ఎన్నికల సీజన్ మొదలు కావడంతో ప్రజలను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నాన్ని మోదీ సర్కార్ ముమ్మురం చేసింది. ఇందుకోసం పండుల సమయాన్ని అనుకూలంగా మార్చుకొని, దీని నెపంతో అన్ని వర్గాలను ఆకర్షించాలని చూస్తోంది. ఈ ప్రయత్నాల్లో భాగంగా కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం (డీఏ)ను నాలుగు శాతం పెంచింది. రైల్వేలోని నాన్ గెజెటెడ్ ఉద్యోగులకు 78 రోజుల వేతనంతో సమానంగా బోనస్‌ను ప్రకటించింది. ఆరు పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)ని పెంచింది గానీ వరి గురించి మరిచింది. మరోవైపు లధక్‌లో ట్రాన్స్‌మిషన్ లైన్ కోసం రూ.20.773 కోట్లు మంజూరు చేస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం కేంద్ర కేబినెట్ భేటీ అయి కీలక నిర్ణయాలు తీసుకుంది. సమావేశం అనంతరం కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ విలేకరుల సమావేశంలో కేబినెట్ నిర్ణయాలు ప్రకటించారు. కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు 42 శాతంగా ఉన్న డీఏను 46 శాతానికి పెంచినట్లు చెప్పారు. 7వ వేతన సంఘం సిఫార్సుల మేరకు కేబినెట్ ఈ మేరకు నిర్ణయించినట్లు ఠాకూర్ తెలిపారు. దీంతో 48.67 లక్షల మంది కేంద్రప్రభుత్వ ఉద్యోగులు, 67.95శాతం పింఛన్‌దారులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. జులై ఒకటో తేదీ నుంచి సవరించిన డీఏ, డియర్‌నెస్ రిలీఫ్ (డీఆర్) వర్తిస్తుందని చెప్పారు. వాస్తవానికి ఏటా రెండుసార్లు జనవరి, జులై నెలల్లో డీఏను సవరించాల్సి ఉండగా మార్చి, అక్టోబరు మాసాల్లో డీఏను కేంద్రం పెంచుతూ వస్తుంది. ఇదే క్రమంలో బకాయిల్ని చెల్లిస్తుందన్నారు.

నాన్ గెజెటెడ్ రైల్వే ఉద్యోగులకు పీఎల్‌బీ

రైల్వే ఉద్యోగులకు ఏటా ఇచ్చే బోనస్‌కు కేబినెట్ ఆమోదం తెలిపిందని, 2022-23కి సంబంధించి 78 రోజులకు సమానమైన వేతాన్ని ఉత్పాదక ఆధారిత బోనస్ (పీఎల్‌బీ)గా చెల్లించనున్నట్లు ఠాకూర్ తెలిపారు. దీంతో 11.07 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ట్రాక్ నిర్వహణ చూసే వారు, లోకో పైలెట్లు, ట్రైన్ మేనేజర్లు (గార్డులు), స్టేషన్ మాస్టర్లు, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, టెక్నిషియన్ హెల్పర్లు, పాయింట్స్‌మెన్, మినిస్టీరియల్ స్టాఫ్‌తో పాటు గ్రూపు 'సి' సిబ్బంది (ఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎస్ఎఫ్ మినహా)కు ఇది వర్తిస్తుంది. ఈ మేరకు బోనస్ చెల్లించడం వల్ల ఖనానాపై రూ.1,968.87 కోట్ల అదనపు భారం పడుతుందని ఠాకూర్ తెలిపారు. రైల్వే సిబ్బంది అద్భుతంగా పని చేశారని, అందుకు గుర్తింపుగా 11,07,346 మంది కోసం రూ.1,968.87కోట్ల పీఎల్‌బీ చెల్లింపునకు కేంద్రం ఆమోదించిందన్నారు. 2022-23లో రైల్వే అద్భుతంగా పనిచేసిందని, 1,509 మిలియన్ టన్నుల కార్గో రికార్డు నెలకొల్పిందని, 650కోట్ల మంది ప్రయాణికులకు గమ్యస్థానాలకు చేర్చిందని అధికారిక ప్రకటన తెలిపింది. పీఎల్‌బీ చెల్లింపులు రైల్వే ఉద్యోగులకు ప్రోత్సాహకమని, మరింత మెరుగైన విధంగా పనిచేసేలా ప్రోత్సహిస్తోందని పేర్కొంది.

వరి సంగతేమిటి?

ఏటా 18శాతం వరి పంటకు ఖర్చులు పెరుగుతున్నా ఈ పంటకు మద్దతు ధరను పెంచలేదు. సోయాబీన్, మొక్కజొన్న, ఎర్ర జొన్నలు వంటి పంటలకు మద్దతు ధర పెంచాలన్న ఆలోచనను చేయలేదు. రబీ పంటన్నింటికీ మద్దతు ధరలు డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు పెంచితే దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని కేంద్రప్రభుత్వం గమనించడం అవశ్యం.

గోదుమలపై రూ.150 పెంపు

రబీ సీజన్‌లో గోదుమ, బార్లీ సహా ఆరు పంటల కనీస మద్దతు ధర (ఎంస్పీ)ను పెంచినట్లు ఠాకూర్ వెల్లడించారు. 2024- 25 రబీ సీజన్‌కుగానూ గోదుమ, బార్లీ, పొద్దుతిరుగుడు, శనగ, ఆవాలు, కంది పంటలకు ఎంఎస్పీ పెంచినట్లు తెలిపారు. అత్యధికంగా క్వింటా గోదుమలపై రూ.150 (ఏడు శాతం) పెరిగిందన్నారు. దీంతో క్వింటా గోదుమల ధర రూ.2,275కు చేరిందన్నారు. బార్లీ పంటపై రూ.115 పెంపుతో క్వింటా ధర రూ.1850కి, శెనగ పంటపై రూ.105 (ఐదు శాతం) పెంపుతో క్వింటా ధర రూ.5,440కి పెరిగాయని, కంది పంటపై రూ.425 పెంచడం ద్వారా క్వింటా రూ.6,425కు పెరిగిందన్నారు. ఆవాలుపై రూ.200 పెంపుతో క్వింటా ధర రూ.5,650కి చేరిందని చెప్పారు. పొద్దుతిరుగుడు పంటపై ఎంఎస్పీపై రూ.150 పెరిగిందని, క్వింటా ధర రూ.5,800కు చేరిందని ఠాకూర్ అన్నారు.

లధక్ ట్రాన్స్‌మిషన్ లైన్‌కు రూ.20వేల కోట్లు

లధక్‌లో 13 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టు కోసం ట్రాన్స్‌మిషన్ లైన్ ఏర్పాటునకు రూ.20,773.7 కోట్లను కేంద్రకేబినెట్ ఆమోదించింది. లధక్‌లో 7.7గిగా వాట్ల సోలార్ పార్క్ ఏర్పాటు చేస్తామని ఆగస్టు 15 ప్రసంగంలో ప్రధాని మోదీ అన్నారు. లధక్‌లోని పాంగ్‌లో13 జీడబ్ల్యు పునరుత్పాదక శక్తిని ఉత్పత్తి చేసే సామర్థ్యంతో పాటు 12 జీడబ్ల్యుహెచ్ బ్యాటరీ శక్తి నిల్వ వ్యవస్థ (బీఈఎస్ఎస్) ఏర్పాటునకు క్షేత్రస్థాయిలో విస్తృతసర్వే తర్వాత ప్రణాళికను కొత్త, పునరుత్పాదక విద్యుత్ (ఎన్ఎన్ఆర్ఈ) శాఖ సిద్ధం చేసింది. ఇందుకోసం అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ మౌలికవసతులు అవసమరని అధికారిక ప్రకటన తెలిపింది. లధక్‌లో 13 జీడబ్ల్యు ఆర్ఈ ప్రాజెక్టు కోసం హరిత విద్యుత్ కారిడార్ (జీఈసీ) రెండవ దశ- అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ (ఐఎస్‌టీఎస్) ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదించినట్లు వెల్లడించింది. ఈ ట్రాన్స్‌మిషన్ లైను హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హరియాణాలోని కైథల్ మీదగా నేషనల్ గ్రిడ్‌తో కలుస్తుందని పేర్కొంది. రూ.20,7773.70 కోట్ల అంచనా వ్యయంతో 2029-30 ఆర్థిక సంవత్సరానికి ప్రాజెక్టు పూర్తి అవుతుందని అంచనా ఉన్నట్లు తెలిపింది.

చరిత్రలో చిరస్థాయిగా అమరావతి ఉద్యమం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: 1400 రోజులకు చేరిన అమరావతి రాజధాని ఉద్యమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. అధికార పార్టీ వేధింపులకు, బెదిరింపులకు, పోలీసుల అక్రమ కేసులకు అదరక బెదరక అమరావతి రాజధాని రైతులు, మహిళలు చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. ఏపీ రాజధాని అమరావతిలో నివాసం ఏర్పరచుకున్న మొదటి రాజకీయ నేత తనేనని చెప్పుకున్న జగన్ అధికారంలోకి వచ్చాక మాట తప్పి, మడమ తిప్పారని విమర్శించారు. గత నాలుగున్నరేళ్లుగా ఏపీని రాజధాని లేని రాష్ట్రంగా మార్చారని, అమరావతిని నిర్వీర్యం చేయాలనే తలంపుతో ముఖ్యమంత్రి మూడు రాజధానుల కుట్రకు తెర తీశారని విమర్శించారు. కోర్టులను కూడా లెక్క చేయకుండా సీఎం జగన్ రాజధాని అంశాన్ని వివాదాస్పదం చేయాలని చూస్తున్నారన్నారు.

మార్గదర్శిపై తప్పుడు కేసులు ఉపసంహరించాలి

మార్గదర్శిపై రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరిత ధోరణి విడనాడాలని, తక్షణమే మార్గదర్శిపై సీఐడీ పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించాలని, అగ్రిగోల్డ్ బాధితులకు సత్వర న్యాయం చేయాలని రామకృష్ణ వేరొక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టినప్పటి నుంచి ఏకపక్షంగా వ్యవహరిస్తూ, తనకు నచ్చని వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని విమర్శించారు. అందులో భాగంగానే మార్గదర్శి చిట్ ఫండ్స్ పై సీఐడీ పోలీసులతో లేనిపోనివి సృష్టింపజేసి, అక్రమ కేసులు బనాయింపజేశారని పేర్కొన్నారు. ఇప్పుడు మరోసారి సీఐడీ పోలీసులు మార్గదర్శిపై అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గం అన్నారు. బాధితులకు సమస్య ఉన్న అగ్రిగోల్డ్ పై చర్యలు చేపట్టకుండా విస్మరిస్తున్నారన్నారు. అగ్రిగోల్డ్ డిపాజిట్ దార్లను అగ్రిగోల్డ్ యాజమాన్యం మోసం చేసిన కేసు పై సీఎం జగన్ ఏమాత్రం స్పందించడం లేదన్నారు.

శ్రామిక జన పక్షపాతి సీపీఐ

జేవీఎస్ఎన్‌మూర్తి

విశాలాంధ్ర - రాజమండ్రి: పార్టీ కార్యకర్తలు రాజకీయ సైద్ధాంతిగా అవగాహనతో ఉండాలని దోపిడీ రహిత సమాజం కోసం పాటుపడాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం స్థానిక సీపీఐ కార్యాలయంలో కమ్యూనిస్టు పార్టీ పని విధానం అనే అంశంపై వర్క్ షాప్ చిట్టూరి ప్రభాకర్ చౌదరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ అధ్యక్షులు తాటిపాక మధు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రజలు ఎక్కడైతే ఉన్నారో అక్కడికి పార్టీ శ్రేణులు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని వారితో మమేకమై పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై చైతన్యపరచాలని పిలుపునిచ్చారు దేశంలో బూర్జువా పార్టీలు అధికారం కోసం అనేక అడ్డదారులు తొక్కుతున్నాయనీ, అధికారమే ధ్యేయంగా పనిచేస్తున్నాయన్నారు. బూర్జువ పార్టీలు పెట్టుబడిదారీ వర్గాల ప్రయోజనాల కోసమే పనిచేస్తాయన్నారు. ప్రజల్లో ఆర్థిక రాజకీయ సామాజిక సాంస్కృతిక చైతన్యం తీసుకొచ్చి ఈ దోపిడీ వ్యవస్థ వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త కమ్యూనిస్టు పార్టీ మేనిఫెస్టోను చదవాలని తద్వారా సోషలిజం సమాజం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ఫౌండేషన్ అధ్యక్షులు తాటిపాక మధు మాట్లాడుతూ చిట్టూరి ప్రభాకర్ చౌదరి ఫౌండ్ షన్ ఆధ్వర్యంలో నెలకు రెండుసార్లు వివిధ అంశాలపై వర్క్ షాప్ నిర్వహిస్తామని దీనిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పార్టీ శ్రేణులు ఉపయోగించుకోవాలన్నారు.

శ్రీజా మహిళా డెయిరీకి ప్రతిష్ఠాత్మక అవార్డు

న్యూఢిల్లీ: ఏపీలోని తిరుపతికి చెందిన మహిళా పాడి రైతుల సంస్థ శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ (ఎస్ఎంఎంపీసీఎల్) ప్రతిష్ఠాత్మక అవార్డును కైవసం చేసుకుంది. చికాగోలో జరిగిన ప్రపంచ డెయిరీ సదస్సులో 'పాడి పరిశ్రమలో మహిళా సాధికారతకు ఆవిష్కరణ' గాను ఈ అవార్డును అందుకుంది. భారత్ నుంచి ఈ అవార్డుకు మూడు సంస్థలు నామినేట్ అయ్యాయి. అందులోని రాజస్థాన్‌లోని ఉదయపూర్‌కు చెందిన ఆశా మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, గుజరాత్ మిల్క్ అండ్ మార్కెటింగ్ కోఆపరేటివ్ ఫెడరేషన్ ఉన్నాయి. ప్రస్తుతం ఎస్ఎంఎంపీసీఎల్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడులోని 11 జిల్లాల్లో రోజుకు సగటున 5.5 లక్షల లీటర్ల పాల సేకరణ చేస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1,000 కోట్ల టర్నోవర్‌ను అందుకోవాలని ఆశిస్తోంది. 'మహిళా పాడి రైతుల సాధికారత కోసం ప్రపంచ వేదికపై గౌరవం పొందడం దేశంలోని మహిళా పాడి రైతులకు, సంస్థకు ఇది గర్వించదగిన సందర్భం' అని ఎస్ఎంఎంపీసీఎల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జయతీర్థాచారి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ఆయన చికాగోలో అవార్డును అందుకున్నారు.

ముస్లింల సమగ్రాభివృద్ధికి జాతీయ స్థాయి కమిషన్: గిడుగు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ముస్లింల సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముస్లింల కోసం జాతీయ స్థాయి కమిషన్ ఏర్పాటు చేస్తుందని హామీనిచ్చారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో బుధవారం రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా షేక్ అమీన్ భాయ్‌కు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం రుద్రరాజు మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో ముస్లింలు బలిదానం చేశారన్నారు. సరిహద్దు గాంధీగా పిలువబడే ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్, అబ్దుల్ కలాం ఆజాద్ వంటి మహనీయుల సేవలను కొనియాడారు. ఎందరో ముస్లింలకు అత్యున్నత పదవులను కాంగ్రెస్ కట్టబెట్టిందని, నాలుగు శాతం రిజర్వేషన్లు ఇచ్చిందని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నరమేధాన్ని ప్రజలు గమనించాలని. మణిపూర్, ఉన్నావో ఘటనలు ఆధునిక సమాజానికే తలవంపులన్నారు. త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. అంబేద్కర్ ఆలోచనా విధానాలతో కాంగ్రెస్ ముందుకెళుతుందని, మైనార్టీల అభివృద్ధికి కట్టుబడి ఉందని, బీసీ కుల గణనకు కృషి చేస్తుందని రుద్రరాజు తెలిపారు. అమీన్ భాయ్ మాట్లాడుతూ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర పద్మశ్రీ, రాకేశ్‌రెడ్డి, విజయవాడ నగర అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు, కార్యవర్గ సభ్యులు వి.గుర్నాథం, శ్రీరామమూర్తి, గొల్లు కృష్ణ, సంజీవరెడ్డి, షేక్ నాగూర్, ఖుర్షీదా, గౌస్ పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.